PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 21 | విజయవాడ, బుధవారం 21 ఆగస్టు 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 21 August 2024 | Rs

సెబీ చైర్‌పర్సన్‌ను విచారించం..!

- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై ఆర్థిక శాఖ వెల్లడి

3

వినేశ్ సహా మను, నీరజ్‌లకు హర్యానా ప్రభుత్వం భారీ నజరానా

10

వైద్యుల భద్రతపై జాతీయ టాస్క్‌ఫోర్స్

- కోల్‌కతా ఘటనపై సుప్రీం నియామకం • ఎఫ్‌ఐఆర్ నమోదులో జాప్యమెందుకు? • ఆస్పత్రిపై దాడి జరుగుతుంటే ఏం చేస్తున్నారు?
- బెంగాల్ ప్రభుత్వం, పోలీసులపై ఆగ్రహం • నిరసనకారులపై బలప్రయోగం తగదని హితవు • దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని సిబిఐకి ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని వైద్య సిబ్బంది భద్రత కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించేందుకు 10 మంది సభ్యులతో జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు మంగళవారం ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్‌జి కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికోపై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జెబి పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కోల్‌కతా ఘటనపై సుమోటోగా విచారణ జరుపుతోంది. పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్‌పి సరిన్ నేతృత్వంలో ప్రకటించిన జాతీయ టాస్క్‌ఫోర్స్ కమిటీలో సరిన్‌తోపాటు డాక్టర్ డి నాగేశ్వరరెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్, డాక్టర్ ఎం.ప్రతిమామూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పూరి, డాక్టర్ సౌమిత్రా రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా, ప్రొఫెసర్ పల్లవి సప్రే, డాక్టర్ పద్మ శ్రీవాత్సవ సభ్యులుగా ఉంటారు. మూడు వారాలలో మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీని కోర్టు ఆదేశించింది. 'మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్టే. ఈ రోజుల్లో చాలామంది యువ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి మన ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రోటోకాల్‌ను

ఆర్‌జి కర్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు

రూపొందించడం అత్యవసరం' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కొల్‌కతా ఘటనకు సంబంధించి జరుపుతున్న దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు మంగళవారం సిబిఐని ఆదేశించింది. ఈ కేసు స్టేటస్‌ను ఈ నెల 22 నాటికి సమర్పించాలని సిబిఐని ఆదేశించింది.

మరో అత్యాచారం జరిగే వరకూ ఎదురు చూడలేం

సంఘటనకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంలో జాప్యంపై న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇందుకు బెంగాల్ ప్రభుత్వాన్ని, ఆస్పత్రి యాజమాన్యాన్ని తప్పుపట్టింది. మరో అత్యాచార ఘటన జరిగే వరకూ దేశం ఎదురు చూడలేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. 'ఘటన జరిగినప్పుడు బాధితురాలి తల్లిదండ్రులు ఆస్పత్రిలో లేరు. కేసు నమోదు చేయాల్సిన బాధ్యత ఆస్పత్రిదే' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 'ఈ ఘటనలో నేరాన్ని ఉదయాన్ని గుర్తించారు. మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ మాత్రం దీన్ని ఆత్మహత్య కేసుగా సమాచారం అందించే ప్రయత్నం చేశారు. ఆయన ప్రవర్తనపై అనుమానాలు ఉన్నప్పుడు, వెంటనే మరో కాలేజికి ఎందుకు నియమించారు? ఎఫ్‌ఐఆర్ ఆలస్యంగా ఎందుకు నమోదు చేశారు. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య శవ పరీక్ష పూర్తయింది. కానీ, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన మూడు గంటల తరువాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సి వచ్చింది? అప్పటివరకూ పోలీసులు, ఆసుపత్రి అధికారులు ఏం చేస్తున్నారు? పార్థివదేహాన్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటలపాటు ఎందుకు మిగతా 5లో

చిన్నారులపై వేధింపులు

- మహారాష్ట్ర థానేలో దారుణం
- టాయిలెట్‌లో స్వీపర్ దుర్మార్గంపై స్థానికుల రైల్‌రోకో
- ఆందోళనకారులపై లాఠీఛార్జి

5



ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో చంద్రబాబు, నారాయణ

అమరావతి నిధులకు ప్రాథమిక ఆమోదం

- సిఎంతో ప్రపంచబ్యాంకు ప్రతినిధుల భేటీ
- తిరిగి చెల్లింపులపై సిఆర్‌డిఎతో చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగర నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడానికి ప్రపంచబ్యాంకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు రెండవసారి మంగళవారం రాష్ట్రానికి వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో వారితో సమావేశమైనారు. ఈ సందర్భంగానే నిధుల మంజూరుకు సంబంధించి తమ సానుకూలతను వారు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అదే సమయంలో తిరిగి చెల్లింపులకు సంబంధించిన పలు అంశాలను వారు ప్రస్తావించినట్లు సమాచారం. సిఎంతో సమావేశానికి ముందు సిఆర్‌డిఎ అధికారులతో జరిపిన భేటీలోనూ తిరిగి చెల్లించే తీరుపైనే వారు ప్రధానంగా వివరాలు సేకరించారు. రుణం తీర్చడానికి ఎంత సమయం పడుతుంది? ఎలా తీరుస్తారు తదితర అంశాలను అడిగినట్లు తెలిసింది. సిఎంతో జరిగిన సమావేశం లోనూ ఈ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. బాబు మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేదని, దీనివల్ల అభివృద్ధి తగ్గిందని పేర్కొన్నారు. తాము రూపొందించిన ప్రణాళికలో అమరావతి పరిధిలో లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేసినట్లు చెప్పారు. దీన్ని సాకారం చేసుకోవాలంటే కొన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉందని, దీనికి నిధుల అవసరం అత్యంత ఆవశ్యమని పేర్కొన్నారు. 2050 నాటికి ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని మార్చాలనేది తమ ఉద్దేశమని వివరించారు. అలాగే అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ తమ సంస్థలను ఏర్పాటు చేసుకునే విధంగా సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మాస్టర్‌ప్లాను రూపకల్పన, భవనాల ప్రణాళిక, మౌలిక సదుపాయాలు, రోడ్లు, ఇతరత్రా అంశాలకు సంబంధించిన అంశాలపై సిఎం వారికి సుదీర్ఘంగా వివరించారు. అమరావతిలో తొమ్మిది నగరాలు ఏర్పాటు చేయాలనుకున్నామని, దీనికోసం కనీస సదుపాయాలైన రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా, భూములిచ్చిన రైతులకు తిరిగిచ్చిన ప్లాట్లలో సదుపాయాలు ఏర్పాటు చేయడం అత్యవసరమని వివరించారు. ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే అతిపెద్ద ఆర్థిక నగరంగా తయారవుతుందనేది తమ అంచనా అని ప్రపంచబ్యాంకు బృందానికి వివరించారు.

నేటి నుండి పర్యటన

ప్రభుత్వం, సిఆర్‌డిఏ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకునేందుకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు బుధవారం నుండి అమరావతి నగరంలో పర్యటించనున్నారు. అక్కడ నిర్మాణంలో ఉన్న కట్టడాలు, ప్రజల కనీస అవసరాలు, ఆదాయ మార్గాలకు ఉన్న అవకాశాలను అన్నిటినీ పర్యవేక్షించనున్నారు. వెంకటపాలెం, మందడం, ఐనవోలు, నెక్కల్లు, దొండపాడు, అనంతవరం గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిసింది. దీంతోపాటు ఇప్పటికే పూర్తయిన పలు నిర్మాణాలనూ వారు చూడనున్నట్లు తెలిసింది.

మరోసారి వెనక్కి తగ్గిన కేంద్రం

- లేటరల్ ఎంట్రీ ప్రకటన రద్దు చేయండి
- యుపిఎస్‌సికి లేఖ
- ఇది ప్రజా విజయమన్న ప్రతిపక్షం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యుపిఎస్‌సి జారీ చేసిన ఉద్యోగ నియామక ప్రకటనలో రిజర్వేషన్ విధానాన్ని పాటించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుండడంతో ఇరకాటంలో పడ్డ కేంద్ర ప్రభుత్వం వేరే గత్యంతరం లేక వెనక్కితగ్గింది. తాజా లేటరల్ ఎంట్రీ ప్రకటనను రద్దు చేయాలని యుపిఎస్‌సిని కోరింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ యుపిఎస్‌సి ఛైర్‌పర్సన్ ప్రీతి సూడాన్‌కు లేఖ రాస్తూ, అట్టడుగు వర్గాల వారు ప్రభుత్వ సర్వీసుల్లో తమకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రాతినిధ్యం పొందేందుకు వీలుగా నియామక ప్రకటనను రద్దు చేయాలని ఆ లేఖలో ఆమెకు సూచించారు.

యుపిఎస్‌సి ఈ నెల 17న లేటరల్ ఎంట్రీ ద్వారా 45 మంది జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల నియామకం కోసం నోటిఫికేషన్

విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ చర్యపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఒబిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిల రిజర్వేషన్ హక్కులను ఇది కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్పందిస్తూ 'రాజ్యాంగానికి ఉన్న బలం నియంతృత్వ శక్తి గర్వాన్ని ఓడించగలదు. రిజర్వేషన్ల ఎత్తివేతకు బిజెపి పన్నిన కుట్రను భగ్నం చేసింది. కాంగ్రెస్, ఇండియా ఫోరం పార్టీల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. బిజెపి అధికారంలో ఉన్నంత వరకూ రిజర్వేషన్ల తొలగింపునకు కొత్త ఎత్తుగడలు పన్నుతూనే ఉంటుంది. మనం జాగరూకతతో ఉండాలి. మోడీ ప్రభుత్వం నుండి ప్రజాశక్తి, ప్రతిపక్షం ఈ దేశాన్ని మరోసారి కాపాడాయి' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై వ్యాఖ్యానించేందుకు బిజెపి ప్రతినిధి సుధాన్షు త్రివేది నిరాకరించారు. ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయం తీసుకున్నదని ఆయన చెప్పారు.

ప్రజల పత్రిక ప్రజాశక్తి

కె.ఎస్ లక్ష్మణరావు

ఘనంగా 44వ వార్షికోత్సవం

ఎంహెచ్, బొమ్మారెడ్డి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రస్తుత సమాజంలో అనేక రకాల పత్రికలు,మీడియా అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రజల పత్రికగా ప్రజాశక్తి తన స్థానాన్ని నిలుపుకుందని కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మోటూరు హనుమంతరావు 23 వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు, బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుల ప్రదానోత్సం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ప్రజాశక్తి సంపాదకులు బి. తులసీదాస్ అధ్యక్షతన ఉత్సాహ పూరిత వాతావారణంలో జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ తెలుగు నాట గొప్ప చరిత్రను సృష్టించిన ఘనత ప్రజాశక్తికి ఉందన్నారు ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను ప్రతిబింబించేది ప్రజాశక్తి ఒక్కటేని అన్నారు.. కార్యనిర్వాహకవర్గం, శాసన నిర్మాణశాఖ, న్యాయశాఖ, మీడియా అనే నాలుగు పిల్లర్లపై ప్రజాస్వామ్య మనుగడ ఆధారపడి ఉందని చెప్పారు. భారతదేశానికి ఇరుగు, పొరుగున ఉన్న దేశాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ఈ సందర్భంగా ఆయన

ఆంధ్రజ్యోతి జర్నలిస్టు వెంకటేష్‌కు ఎంహెచ్ అవార్డు అందజేస్తున్న ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, తెలకపల్లి రవి, నల్లి ధర్మారావు, అరుణ, చిత్రంలో ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు, గడ్డెన్న, హరికిషోర్

వెంకటేష్‌కు ఎంహెచ్ అవార్డు ప్రదానం

- మధు, షబ్బీర్‌లకు బొమ్మారెడ్డి అవార్డు

10

వివరించారు. ఎన్ని పరిమితులున్నప్పటికీ మన దేశంలో మీడియా ప్రభావం ఇప్పటికీ బలంగానే ఉందని చెప్పారు. అదే సమయంలో పత్రికలు తమ వర్గ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. పోలవరం నిర్వాసితులు, రాష్ట్ర విజభన సమస్యలు, ప్రత్యేకహోదా వంటి అంశాలను ప్రజాశక్తి ప్రచురిస్తున్నతీరు, ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజాశక్తి ప్రజల పత్రిక కాబట్టే దశాబ్దాలు గడిచినా శక్తివంతంగా ప్రజ్వరిల్లుతోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ఎంహెచ్ అవార్డు కమిటీ ఛైర్మన్, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. ప్రజాశక్తి స్వచ్ఛ సత్యపు స్వర్ణకాంతులు ప్రసరింపజేస్తోందంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన కవితను ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిని చూస్తుంటే ప్రజాశక్తి మరింతగా ప్రజ్వరిల్లడం ఖాయమన్న విశ్వాసం కలుగుతోందన్నారు. ఈ ఉత్సాహానికి, స్ఫూర్తికి మోటూరు హనుమంతరావు మూలపురుషడని, బొమ్మారెడ్డి ప్రజాశక్తిమంతుడని చెప్పారు. వారిద్దరిది ప్రజా ఉద్యమాలతో పెనవేసుకున్న బంధమన్నారు. ప్రస్తుతం మీడియా రంగం స్పష్టంగా చీలిపోయిందని, అత్యధిక మీడియా సంస్థలు ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతున్నాయని చెప్పారు. సమాజంలో ఎప్పుడూ సమస్యలుంటాయని, ప్రజలు వాటి గురించి ఆలోచించకుండా అనవసరమైన విషయాలచుట్టూ తిరిగేటట్టు ఒక భ్రమావరణాన్ని మీడియా సృష్టిస్తోందన్నారు. దానికి భిన్నంగా ప్రజాశక్తి ఎన్ని కష్టాలు వచ్చినా ప్రతి అక్షరాన్ని ప్రజల పక్షం చేయాలన్న తన నినాదానికి ప్రజాశక్తి కట్టుబడి ఉందన్నారు. ప్రజాశక్తిలో ప్రజలు, ప్రజల సమస్యలు మాత్రమే కనపడుతాయని అన్నారు. ఇప్పటిదాకా మీడియాను ఫోర్త్ పిల్లర్‌గా మిగతా 10లో

మంకీపాక్స్‌తో జాగ్రత్త !

న్యూఢిల్లీ : మంకీపాక్స్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) అంటు వ్యాధిగా గుర్తించడం, ఆఫ్రికా, ఐరోపాలో ఇది వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో మన దేశం అప్రమత్తమైంది. ఎంపాక్స్ లక్షణాలతో బాధపడే వారు దేశంలోకి రాకుండా నిరోధించేందుకు బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో గల సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మంకీపాక్స్‌ను ఎదుర్కోడానికి తీసుకుంటున్న చర్యలు, సన్నద్ధత, సంబంధిత ప్రజారోగ్య చర్యలను సమీక్షించేందుకు ప్రధాని మోడీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.కె.మిశ్రా అధ్యక్షతన ఆదివారం ఇక్కడ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. డబ్ల్యు హెచ్‌ఓ గతంలో ఇచ్చిన డేటా ప్రకారం 116 దేశాల్లో 2022 నుండి మంకీపాక్స్ కేసులు 99,176 నమోదయ్యాయి. 208మంది మరణించారు. భారత్‌లో ఈ కేసులు 30వరకు నమోదయ్యాయి. చివరి కేసు ఈ ఏడాది మార్చిలో నమోదైంది. ఎంపాక్స్ లక్షణాలు ఉన్న రోగుల కోసం ఢిల్లీలోని లోక్‌నాయక్ జయప్రకాష్ ఆస్పత్రి, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆస్పత్రిలో ఐసోలేషన్ గదులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో, ఓడరేవుల్లో దీని గురించి తెలియచేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మంకీ పాక్స్ లక్షణాల గురించి ప్రజల్లో చైతన్యం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.

కెఆర్ఎంబికి నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు

- కేసు విచారణ సెప్టెంబరు 9కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ పరీవాహ ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్‌ఎంబి) పరిధిలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబరు 9కి వాయిదా వేసింది. రెండు ప్రాజెక్టులను కెఆర్‌ఎంబికి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టుల్లోని నీటిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించేలా జీవో ఇచ్చింది. ఆ రకంగా విద్యుత్ ఉత్పత్తికి వాడుకుంటుంది. అయితే రాష్ట్ర పునర్విభజన చట్టం సెక్షన్ 87 ప్రకారం ఆ రెండు ప్రాజెక్టులు కెఆర్‌ఎంబి పరిధిలోనే ఉండాలి. ఆ రకంగా ఆ రెండు ప్రాజెక్టులను కెఆర్‌ఎంబికి అప్పగించాలని, అలాగే ఆ ప్రాజెక్టుల్లో నీటిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో పై స్టే విధించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జిలతో కూడిన ధర్మాసనం విచారించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ రాష్ట్ర పునర్విభజన చట్టం సెక్షన్ 87 ప్రకారం ఆ రెండు ప్రాజెక్టులు కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన విద్యుత్పత్తి జీవోపై స్టే విధించి మధ్యంతర ఉపసమనం కల్పించాలని కోరారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 59 అవుట్‌లైట్స్ ఉన్నాయని, అయితే మొదటి స్టేజ్‌లో 15 అవుట్‌లైట్స్ అప్పగించాల్సి ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ తమకు రిప్లై దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం సెప్టెంబర్ 9 వరకు సమయం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ అశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ విభజన చట్టం ప్రకారమే తాము ఆ ప్రాజెక్టులను కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ విడుదల చేశామని, అయితే దానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని, తెలంగాణ ప్రభుత్వ వ్యతిరేకించిందని తెలిపారు. వాదనలు విన్న సుప్రీం కోర్టు ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

రాష్ట్రంలో సిబిఐ విచారణకు ఓకే

- అనుమతిస్తూ గెజిట్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సిబిఐ విచారణకు అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర సంస్థలు, ఉద్యోగులు, ప్రైవేటు సంస్థలపై నేరుగా సిబిఐ విచారణ చేసే విధంగా అనుమతులు ఇచ్చింది. అయితే ఎపి ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతిని తప్పనిసరి చేసింది. జులై ఒకటో తేదీ నుండే ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని అందులో పేర్కొంది. ఢిల్లీ స్పెసల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 1946లో సెక్షన్ 3 ప్రకారం విచారణ పరిధిని పెంచుతున్నట్లు పేర్కొంది. వాస్తవంగా గత టిడిపి ప్రభుత్వ హయాంలో సిబిఐ విచారణను నిలిపేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు మరలా అనుమతులు ఇస్తూ గెజిట్ జారీచేసింది.

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత

ఎపి గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు వాలంటీర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు నెలకు రూ.10వేల వేతనం చెల్లిస్తామన్న హామీని నెరవేర్చాలని ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సదస్సులో కె.ధనలక్ష్మి ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విజయవాడ ఎంబివికెలో మంగళవారం హుమయూన్ భాష అధ్యక్షతన ఎపి గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ బలవంతంగా రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్ల విధి విధానాలు, జాబ్ చార్ట్ ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రంగా ఉందని అందువల్లే 5,10 వేల గౌరవ వేతనానికి కూడా పనిచేయడానికి చదువుకున్న నిరుద్యోగులు పోటీ పడుతున్నారన్నారు. వాలంటీర్లుగా 10నుంచి పిజి చేసిన వారు కూడా పనిచేస్తున్నారని, మిగతా 5లో

వికలాంగులకు ఉచితంగా బ్యాటరీ సైకిళ్లు

- ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక రేషన్ కార్డులు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వికలాంగులకు ఉచితంగా బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించాల్సిందిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లతో స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు ప్రోత్సహమందించాలని సూచించారు. స్వయం ఉపాధి కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా చర్యలు చేపట్టాలన్నారు. వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రత్యేక రేషన్ కార్డులు కూడా ఇవ్వాలని సూచించారు. వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లు ఇచ్చేందుకు తక్షణమే ప్రణాళిక రూపొందించాలన్నారు. వికలాంగులకు సేవ చేసే అదృష్టం రావడం గొప్ప భాగ్యమని, అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. బోగస్‌సర్టిఫికెట్లతో పింఛన్ల తీసుకునే వారికి అడ్డుకట్ట వేయాలని, ఆర్థిక ఇబ్బందులున్నాఇచ్చిన హామీ మ ఏరకు మొదటి నె లకు రూ.7వేలు పింఛన్ ఇచ్చామన్నారు. అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు పింఛన్లు అందించాలని మంత్రి , అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమం సెక్రటరీ ఎ సూర్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ డి రవిప్రకాష్‌రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ ఎండి ఎంఎ కుమార్‌రాజ్ పాల్గొన్నారు.

బిసి వెల్ఫేర్ హాస్టల్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మంత్రి ఎస్ సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా బిసి వెల్ఫేర్ హాస్టల్స్, గురుకులాల నిర్వహణలో అధికారులు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టల్స్‌లోకి రానివ్వొద్దని మంత్రి అధికారులకు సూచించారు. హాస్టళ్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం, అల్పాహారం అందించాలన్నారు. వార్డెన్లు రాత్రి వేళల్లో హాస్టల్స్‌లోనే బస చేయాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శిస్తూ కింది స్థాయి సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, బిసి గురుకులం కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జనవరి నుంచి జన్మభూమి 2.0

- ఐదేళ్ళలో 17,500 కిలో మీటర్ల సిసి రోడ్లు
- పంచాయతీరాజ్ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'తరలుదాం రండి మనం జన్మభూమికి.. తల్లిపాల రుణం కొంత తీర్చడానికి ..' గీతం పల్లె సీమల్లో మళ్లీ మర్మోగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2025 జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చేవారితో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్ళలో 17,500 కిలో మీటర్ల మేర సిమెంట్ రోడ్లు నిర్మిస్తామన్నారు. మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీశాఖలపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ రోడ్లతో పాటు 10వేల సిసి కిలో మీటర్ల డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.990కోట్లు, జల్‌జీవన్‌మిషన్ పథకానికి రాష్ట్ర వాటాగా రూ.500కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన నిధులను దారి మళ్లించిందని చెప్పారు. ఫలితంగా కనీస స్థాయిలో కూడా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను బలోపేతం చేస్తామన్నారు.

పంచాయతీరాజ్ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు , డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

14-19 మధ్య కాలంలో చేపట్టిన పలు కార్యక్రమాలు గ్రామాల రూపురేఖలు మార్చితే, గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి గ్రామాలను సమస్యలకు కేంద్రాలుగా మార్చిందని చెప్పారు.

గ్రామాల్లో ఇళ్లకు అవసరమైన విద్యుత్తు, గ్యాస్, టాయిలెట్, నీటికుళాయి వంటి వాటిని అందించేందుకు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. గ్రామాల నుండి సమీపప్రాంతాల అనుసంధానం కోసం రోడ్లు, మార్కెట్ ప్లేస్‌లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఎల్ఇడి విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశామని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి నిర్వహణ కూడా చేపట్టకుండా వదిలేసిందన్నారు. దీంతో గ్రామాల్లో 60 శాతం లైట్లు మాత్రమే వెలుగుతున్నట్లు అధికారులు తెలిపారన్నారు. ఇందుకు సంబంధించి రూ.482 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల భవనాల ద్వారా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేయాలని సిఎం సూచించారు. గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులను చర్చించేందుకు ఆయా గ్రామాల్లో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపుపై దృష్టి పెట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్‌తో కలుపుకుని రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ బెల్ట్ సాధించాలని సిఎంపేర్కొన్నారు. నగర వనం కార్యక్రమం ద్వారా 175 నియోజకవర్గాల్లోనిపట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు చేపట్టాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ గ్రామాల ముఖచిత్రం మార్చడంలో కీలకమైన పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేడు మళ్లీ నిధులు కేటాయించడం, కొత్త విధానాల ద్వారా గ్రామాల్లో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్షలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు

- 2047 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపి
- సెప్టెంబరు1 నుంచి ప్రజల అభిప్రాయాల సేకరణ
- సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2047 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఏడాదికి 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా అక్టోబరు 12న వికసిత్ ఎపి -2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఇదే అంశంపై మంగళవారం సచివాలయం నుంచి ఆయన వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఈ నెల 28న జరుగునున్న మంత్రిమండలి సమావేశానికి విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను సేకరించి.. అదే నెల 10 నుంచి 14 వరకు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని, 10 నుంచి 15వ తేదీ మధ్యలో మండల, మునిసిపల్, గ్రామ స్థాయి అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని, సెప్టెంబరు 15 నుంచి 24 మధ్య వికసిత్ ఎపి విజన్-2047 తుది ముసాయిదా సమర్పణ ఉంటుందని తెలిపారు. వికసిత్ ఎపి-2047లో భాగంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి ప్రతి జిల్లాకు ఐదేళ్ల విజన్‌తో కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పేదరిక రహిత రాష్ట్రం, సామాజిక, భౌతిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జనాభా నిర్వహణ, సులభతర జీవన విధానం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని వీటిని రూపొంది స్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వికసిత్ ఎపి -2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఐటి కార్యదర్శి సౌరవ్‌గౌర్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ హరినారాయణ, ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఏకలవ్య టీచర్ల కుటుంబాలను ఆదుకుంటాం

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఇటీవల వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ చనిపోయిన ఇద్దరు ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షల ఆర్థిక సహాయం, ఉద్యోగం ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని ఆమె తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆమె మంగళవారం మాట్లాడారు. కేంద్ర సాయంగా రూ.10 లక్షలు, రాష్ట్ర సహాయంగా రూ.5 లక్షలు కలిపి ఆయా కుటుంబాలకు అందజేస్తామన్నారు. కాగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలోని ప్రైవేటు వసతి గృహంలో ముగ్గురు చిన్నారులు కలుషిత ఆహారం తిని మృతి చెందిన ఘటనపై సిఎం చంద్రబాబునాయుడు సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలు, వసతి గృహాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారని మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లు ఐటిడిఎ పిఒ, ఎమ్మార్వో, డిఇఒలను ఆదేశించామని ఆమె తెలిపారు.

ముడి సరుకు లేక ఉత్పత్తిపై ప్రభావం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

ముడి సరుకు లేక విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1286వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఎఐటియుసి నాయకులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిస్థితిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకును సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

సామాజిక రక్షణ చట్టం తేవాలి

- మంత్రి లోకేష్‌కు రజక వృత్తిదారుల సంఘం వినతి
- సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేష్ హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధి విధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం మంత్రి లోకేష్‌కు నాయకులు భాస్కరరావు, నాయకులు వెంకటేశ్వరరావు, బి సుబ్బారావు, శంకరరావు, ఎం సుబ్బారావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న దోబీ పోస్టుల్లో రజక యువతకు అవకాశం కల్పించాలని కోరారు. ఇప్పటికీ రాష్ట్రంలో రజకులపై దాడులు జరుగుతున్నాయని, దౌర్జన్యాలు, అక్రమకేసులు, సాంఘిక బహిష్కరణలకు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రజక మహిళలపై అత్యాచారం హత్యలు వంటి దుర్మార్గాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి లోకేష్ సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

80 శాతం రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమలో సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల సాగుకు నోచుకోని వ్యవసాయ భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు వీలుగా అవసరమైన విత్తనాలను 80 శాతం రాయితీపై అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి మంగళవారం రాయలసీమ జిల్లాల వ్యవసాయ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో డిమాండ్ ఉన్న పంటలకు, రైతులు కోరుకునే రకాల విత్తనాలు సిద్ధం చేయడంతో పాటు అటువంటి విత్తనాలకు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. సాగు చేయని భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలివ్వాలని అధికారులకు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల వాస్తవ అంచనాలను రూపొందించాలని, రైతులకు సాధారణ సాగులో ఆదాయం తగ్గకుండా ప్రత్యామ్నాయ పంటలను సూచించాలన్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పంట దిగుబడులు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వ్యవసాయ సంచాలకులు ఎస్ ఢిల్లీ రావు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో 15,03,613 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను, ఇప్పటి వరకు 11,24,351 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగయ్యాయని తెలిపారు. 3,79,262 హెక్టార్ల విస్తీర్ణంలో ఎటువంటి పంటలు సాగు చేపట్టక పోవడంతో ఆయా భూములు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయన్నారు. 2,22,349 హెక్టార్ల విస్తీర్ణంలో ఉలవలు, మిగిలిన విస్తీర్ణంలో పెసర, అలసందలు, జొన్న, కొర్ర, మినుము, సజ్జ పంటలను సిఫారసు చేశామని తెలిపారు. ఎపి విత్తనాభివృద్ధి సంస్థ ఎమ్‌డి శివప్రసాద్ మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ చివరి దశలో ఉందని రానున్న రెండు రోజుల్లో సరఫరా ఏజెన్సీలను నియమించి విత్తన పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమీక్షలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

- పెద్దారెడ్డి ఇంటిపై దాడికి యత్నించిన టిడిపి శ్రేణులు
- వైసిపి నాయకుడి ఇంటికి నిప్పు, వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి - తాడిపత్రి

టిడిపి శ్రేణుల దాడిలో ధ్వంసమైన వాహనాలు

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున గుమిగూడారు. పెద్దారెడ్డి ఇంటిపై దాడికి యత్నించారు. ఆయన అనుచరుడి ఇంటికి నిప్పంటించారు. పలు వాహనాలను ధ్వంసం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మంగళవారం తాడిపత్రికి వస్తున్న నేపథ్యంలో కొండాపురం వద్ద ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. తమ ఇంటి వద్ద పని ముగించుకుని తిరిగి వెళ్తానని పోలీసులకు సర్ధిచెప్పి ఆయన తాడిపత్రికి వచ్చారు. తాడిపత్రికి పెద్దారెడ్డి వస్తున్న విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పట్టణంలో గుమిగుడాయి.

తాడిపత్రిలోకి రాకుండా ఆయనను అడ్డుకునే ప్రయత్నంలో పెద్దారెడ్డి అనుచరుడు కందిగోపుల మురళి ఇంటిపై టిడిపి శ్రేణులు దాడి చేశాయి. ఆయన వాహనాలకు, ఇంటికి నిప్పు పెట్టాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. వైసిపి కార్యకర్త రఫీపై దాడికి పాల్పడ్డారు. పెద్దారెడ్డి ఇంట్లో ఉన్నారన్న సమాచారంతో ఆయన ఇంటిపై దాడికి యత్నించారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు. టిడిపి శ్రేణులను అక్కడి నుంచి చెదరగొట్టారు. అతి కష్టం మీద పెద్దారెడ్డిని తిరిగి అనంతపురానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి జగదీష్ తాడిపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం పెద్దారెడ్డి, జెసి ప్రభాకర్ అనుచరులు పట్టణంలో బీభత్సం సృష్టించారు. ఈ నేపథ్యంలో ఆయనను అనంతపురానికి తరలించారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజిబాబు

విశాఖ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

కొవ్వొత్తుల ర్యాలీలు, మానవహారాలు

- వెల్లువెత్తిన వైద్యుల నిరసనలు
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ధర్నాలు, కొవ్వొత్తుల ర్యాలీలు, మానవహారాలు చేపడుతూ వైద్య విద్యార్థులు, వైద్యుల ఆందోళన కొనసాగుతోంది. అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని, వైద్యులకు, మహిళలకు రక్షణ కల్పించాలని నినదించారు. వారికి పలువురు ప్రజాప్రతినిధులు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, తదితర ప్రజా సంఘాల నేతలు, న్యాయవాదులు, సిపిఎం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. విశాఖలో ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జూనియర్ డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖ ఎంపి శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సంఘీభావం తెలిపారు. 53 వార్డులోని నరేంద్రనగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

కర్నూలులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

ప్రదర్శన చేశారు. దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యాన పోస్ట్ కార్డులు రాసి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు రిజిస్ట్రార్, జాతీయ మహిళా కమిషన్ చైర్మన్, కోల్‌కత్తా హైకోర్టు రిజిస్ట్రార్‌కు పంపించారు. అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం రామతీర్థాలు కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు తహశీల్దార్ కార్యాలయం వద్ద న్యాయవాదులు ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉండిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు మానవహారం చేపట్టారు. భీమవరంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో జనసేన ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. కుక్కునూరులో వైద్య సిబ్బంది నల్ల జెండాతో ర్యాలీ నిర్వహించారు.

జీలుగుమిల్లిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. కర్నూలులో నల్ల బ్యాడ్జీలతో జూనియర్ డాక్టర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా, బేతంచెర్లలో మానవహారం చేపట్టారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో వెలగతోడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాకినాడలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు కాకినాడ బార్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. కాజులూరులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో, పెద్దాపురంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. తాళ్లరేవులో స్కీమ్ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. విజయనగరంలోని మయూరి జంక్షన్ నుంచి బాలాజీ కూడలి వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. బొబ్బిలి పట్టణంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులు ర్యాలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, బలిజిపేట, కొమరాడలో ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు.

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులోని వైఎస్ఆర్ నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన, గుడ్లూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గుంటూరు జిల్లా పొన్నూరులో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. మంగళగిరిలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎన్‌టిటిపిఎస్ మహిళా ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు.

విదేశీ పర్యటనకు అనుమతివ్వండి

- సిబిఐ కోర్టులో వైఎస్ జగన్, విజయసాయి రెడ్డి పిటిషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యక్తిగత పనుల నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపి విజయసాయి రెడ్డిలు సిబిఐ కోర్టును ఆశ్రయించారు. వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై మంగళవారం నాంపల్లి సిబిఐ కోర్టులో విచారణ జరిగింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో యూరప్ వెళ్లేందుకు అనుమతివ్వాలన్న విజయసాయిరెడ్డి పిటిషన్‌పై వాదనలు పూర్తి కాగా, ఈ నెల 30కి తీర్పును వాయిదా వేశారు. సెప్టెంబర్‌లో లండన్ వెళ్లేందుకు అనుమతివ్వాలన్న జగన్ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేసేందుకు సిబిఐ సమయం కోరడంతో తదుపరి విచారణను బుధవారానికి కోర్టు వాయిదా వేసింది.

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి (బాపట్ల జిల్లా)

పిడుగుపాటుకు ఓ మహిళ మృతి చెందిన ఘటన బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... పొన్నపల్లి గ్రామానికి చెందిన తిరుపతమ్మ (35) పొలంలో వరి నాట్లు వేసేందుకు కూలిపనికి వెళ్లారు. పొలంలో నాట్లు వేస్తున్న సమయంలో అకస్మాత్తుగా వర్షం పడింది. అదే సమయంలో కూలీలకు సమీపంలో పిడుగు పడింది. పిడుగు శబ్దానికి తిరుపతమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి కూలీలు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి భర్త గతంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో తిరుపతమ్మ కూలి పనులు చేసుకుంటూ తమ ఇద్దరి పిల్లలను చదివిస్తున్నారు. ఇప్పుడు ఆమె కూడా మరణించడంతో పిల్లలు అనాథలయ్యారు.

ఎయు పరిధిలో నేటి పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 21న జరగాల్సిన పిజి, యుజి, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్లు అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.రత్నం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. మరలా ఈ పరీక్షలను ఎప్పుడు నిర్వహించేది త్వరలో ఎయు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

ఐదుగురి పరిస్థితి విషమం

- అత్యవసర సేవలు అందిస్తున్న కెజిహెచ్
- సెంట్రల్ జైలుకు అనాథ ఆశ్రమం నిర్వాహకుడు
- కొనసాగుతున్న విచారణ

విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థుల్లో మంగళవారం ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారికి అత్యవసర సేవలు అందిస్తున్నట్లు విశాఖ కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. పాడేరు ఆస్పత్రిలో ఎనిమిది మంది, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22 మంది చికిత్స పొందుతున్నారు. విశాఖ కెజిహెచ్‌లో 14 మంది చికిత్స పొందుతుండగా.. నర్సీపట్నం నుంచి కొంతమందిని ఇక్కడికి తీసుకువచ్చారు. మొత్తం 38 మంది విద్యార్థులు కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గ్రామాలకు వెళ్లిపోయిన వారిలో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో వారు కూడా కెజిహెచ్‌లో జాయిన్ అయ్యారు. మెరుగైన వైద్యం కోసం పాడేరులో చికిత్స పొందుతున్న ఎనిమిది మందిలో ఆరుగురిని వివిధ ప్రయివేట్ ఆస్పత్రులకు తరలించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరజ్యోతి తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శిరీష పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఘటనపై రెవెన్యూ, పోలీస్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. బిఎన్ఎస్ 105 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు నర్సీపట్నం సిఐ అప్పన్న తెలిపారు. హత్య నేరం కేసు నమోదు చేసి చోడవరం మెజిస్ట్రేట్ వద్ద నిర్వాహకులు కిరణ్ కుమార్‌ను హాజరు పరిచామని పేర్కొన్నారు. కోర్టు రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. నిర్వాహకుడి వివిధ బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులూ లేకుండా ఆశ్రమం ఏర్పాటు చేయడం, నిర్వాహకుడు చెబుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఆశ్రయం పొందుతున్న విద్యార్థుల సంఖ్యకు తేడా ఉండడంతో ఆరా తీస్తున్నారు.

పలువురి పరామర్శ

నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య, నర్సీపట్నం ఆర్‌డిఒ జయరామ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సిహెచ్‌సి సిబ్బందికి ఆదేశించారు. అనంతరం రామగిడ్డయ్య మీడియాతో మాట్లాడుతూ.. నిర్వాహకుని నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని, దీనిపై సమగ్ర విచారణ చేపడుతున్నామని తెలిపారు.

పంట పొలాల్లో ధర్నా చేస్తున్న రైతులు

నీటి కొరతతో నెర్రెలు బారిన పంట పొలాలు

- సాగునీటి కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాగునీరు లేక ఎండిపోతున్న పంట పొలాల్లో దిగి రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పి మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో నీటి కొరతతో పంట ఎండిపోయింది. దీంతో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు ఆధ్వర్యంలో రైతులు ఎండిపోతున్న పంట పొలాల్లోకి దిగి ధర్నా చేశారు. పంట పొలాల్లో నెర్రలు తీసిన మట్టి పెళ్లలను చేతితో పట్టుకుని నిరసన తెలిపారు. గ్రాంటు ప్రాంతంలోని పంట పొలాల్లో వెదజల్లు విధానంలో పంట వేసి సుమారు 15 నుంచి 20 రోజులు అయిందని, అయినా నేటికీ పంట కాలువ ద్వారా చుక్కనీరు సరఫరా కాలేదని రైతులు పిల్లి లోవరాజు, పంపన శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జోరుగా కురిసిన వర్షాల సమయంలో పైనున్న నీరు దిగడానికి సాగునీటి కాలువకు సరఫరా నిలుపుదల చేశారని, పై పొలాల నుంచి నీరు దిగిపోయినా తమ పొలాలకు అధికారులు సాగునీరు ఇవ్వడంలేదని వాపోయారు. ఖరీఫ్ సాగులో ఇటువంటి ఇబ్బందులు ప్రతి ఏడాదీ ఎదుర్కొంటున్నా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోతున్నారని, ఒఎన్‌జిసి పైప్‌లైన్ ద్వారా అయినా సాగునీరు ఇప్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ నీటిపారుదల శాఖ అధికారులు గ్రాంటు ప్రాంతానికి పూర్తిస్థాయిలో సాగునీరు వచ్చేలా వెంటనే చర్యలు చేపట్టాలని, లేనియెడల రైతాంగంతో కలిసి రోడ్డు ఎక్కి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పితాని సత్తిబాబు, మేడిశెట్టి శ్రీను, బాదం ఏడుకొండలు, భైరవమూర్తి, సూరంపూడి సూరిబాబు, సూరంపూడి శ్రీను, కోరుకొండ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నంద్యాలలో విషాదం

- మట్టిగోడ కూలి మహిళ మృతి
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వెలుగోడు (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టిగోడ కూలి ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వెలుగోడు పట్టణంలో చోటుచేసుకుంది. వెలుగోడు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడులోని అమ్మవారి శాల వీధికి చెందిన కుమ్మరి హనుమన్న, కుమ్మరి మద్దమ్మ దంపతులతోపాటు వారి కుమారులు రామాంజనేయులు, గిడ్డన్న, కోడళ్లు, ఇద్దరు మనవళ్లతో కలిసి మట్టి గోడలతో నిర్మించుకున్న రేకుల షెడ్డులో నివాసముంటున్నారు. సోమవారం రాత్రి అందరూ ఆ షెడ్డులోనే నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గోడ కూలి మద్దమ్మ(50)పై పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమన్న, రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రేకుల షెడ్డు నిర్మించుకున్న గోడ పాతది కావడంతో భారీ వర్షానికి ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. గిడ్డన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న బబిత

14న జాతీయ లోక్ అదాలత్

- స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు బబిత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ఉచిత న్యాయ సేవలను సత్వరమే అందించేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు, సెక్రటరీ (డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి) ఎం.బబిత తెలిపారు. సెప్టెంబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల ఆవరణలో 'జాతీయ లోక్ అథాలత్' నిర్వహించనున్నట్లు చెప్పారు. అమరావతిలోని బిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల రాజీ పడదగిన క్రిమినల్, లేబర్, సివిల్ కేసులతోపాటు కోర్టుల ముందుకురాని తగాదాలకు సంబంధించిన కేసులను లోక్ అథాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని త్వరితగతిన పొందడంతోపాటు రాజీపడిన కేసుల్లో చెల్లించిన కోర్టు ఫీజునూ వాపసు పొందవచ్చని చెప్పారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ హెచ్.అమరలింగేశ్వరరావు మాట్లాడుతూ చట్ట పరంగా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. స్వల్ప తగాదాలతో కోర్టులకు వెళ్లడం తగదని, రాజీ మార్గమే రాజ మార్గం అన్న చందంగా లోక్‌అథాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులు, హింసలకు సంబంధించి పిల్లల రక్షణకు జిల్లా పోలీస్ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీతోపాటు న్యాయ సేవాధికార సంస్థ అవసరమైన తోడ్పాటు అందిస్తుందని తెలిపారు.

బావిలో దూకి అక్కాచెల్లెలు ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

నేల బావిలో దూకి అక్కాచెల్లెలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడుకు చెందిన సేబి సోంబారమ్మ (24)కు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం కుదిరింది. గత వారం రోజులుగా ఆ జంట మధ్య మనస్పర్థలు రావడంతో సోంబారమ్మ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తాను బతకనని, చనిపోతానంటూ వరుసకు చెల్లెలు పోయి లక్ష్మి (18)కి చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. నీవు లేకపోతే తాను కూడా బతకనని, ఇద్దరం కలిసే చనిపోదామని సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని నేలబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బావిలో తేలి ాడుతున్న మృతదేహాలను స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఎస్సై పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలంలో మళ్లీ చిరుత కలకలం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలోని నీలం సంజీవరెడ్డి భవనం వద్ద చిరుత పులి సంచారం మరోసారి కలకలం రేపింది. భవనం చివరి గేటు వద్ద సోమవారం అర్ధరాత్రి చిరుత పులి సంచారాన్ని కొందరు సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. శ్రీశైలంలో తరచుగా చిరుతపులి సంచరిస్తూనే ఉంది. దీంతో యాత్రికులు, స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శ్రీశైలం ఆలయ పరిసరాల్లో చిరుత పులి సంచరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత పదిహేను రోజుల క్రితం ఆలయ అధికారి కుక్కపై చిరుత దాడి చేసింది. అయితే కుక్క గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి పారిపోయింది.

కోల్‌కతా ఘటనపై నేడు నిరసన

సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో వైద్యురాలి హత్యను నిరశిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు సిఐటియు రాష్ట్ర కమిటీ తెలిపింది. దీన్ని జయప్రదం చేయాలనీ కోరింది. ఈ మేరకు మంగళవారం సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా డాక్టర్లకు రక్షణ లేని పరిస్థితిని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. గత పదిరోజుల నుండి వస్తున్న వార్తలను బట్టి అక్కడి ప్రభుత్వం ముద్దాయిలను కాపాడుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మెడికోలు, అనేక తరగతుల వారికి సంఘీభావంగా ఆందోళనలు జరుగుతున్నా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ముద్దాయిలను పట్టుకోవడంలో విఫలమైందని తెలిపారు. అనేక ఆస్పత్రుల్లోనూ డాక్టర్లపై అత్యాచారాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 18న ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటన కూడా అత్యంత దారుణంగా ఉందని వివరించారు. ఇటువంటి సమయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడం, దేశవ్యాప్తంగా ప్రజలు సంఘీభావం తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్లో మెడికోపై జరిగిన అత్యాచారాన్ని నిరసించాలని, ఆస్పత్రుల్లో డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం అన్ని స్థాయిల్లో ప్రదర్శనలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్ణయించినట్లు వారు తెలిపారు.

ఎఎస్ఆర్ జిల్లా వైద్యాధికారి చర్యలు సరికాదు

మెడిలో హత్యపై నిరసన వ్యక్తం చేసిన ఎఎస్ఆర్ జిల్లాలో ఉద్యోగులకు జిల్లా వైద్యాధికారి మెమో జారీచేయడం సరికాదని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది.

శెట్టిపల్లి హక్కుదారులకు అవకాశం కల్పించాలి

- సిఎంకు మాజీ ఎంపి పి.మధు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 610ని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో అమలు చేయాలని, శెట్టిపల్లి గ్రామంలో హక్కుదారులకు అవకాశం కల్పించాలని మాజీ ఎంపి పి.మధు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. తిరుపతి జిల్లా శెట్టిపల్లిలోని 6.30 ఎకరాల ఇనామ్ భూముల్లో రైతులు 100 సంవత్సరాలుగా హక్కుదారులుగా ఉన్నారని తెలిపారు. గ్రామం 30 ఎకరాలు, చెరువు 60 ఎకరాల్లో ఉందని తెలిపారు. రైల్వే కోచ్ వర్కుషాప్ కోసం రైతులు 83 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం రైతులు 257 ఎకరాల్లో వ్యవసాయం చేస్తుండగా మిగిలిన 200 ఎకరాలు తమ అవసరాల కోసం ప్రజలకు ఇళ్లస్థలాలుగా అమ్మారని పేర్కొన్నారు. 3000 మంది తిరుపతి వాసులు స్థలాలు కొని రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని వివరించారు. 2019లో టిడిపి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేసిన సందర్భంగా మొత్తం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రైతులకు 30 శాతం భూమిని ఇచ్చేటట్లు, ప్లాటు యజమానులకు 50 శాతం భూమిని ఇచ్చేటట్లు(కనీసం రెండుసెంట్ల భూమితో ప్రారంభం) జిఓలో నెంబరు 173లో పేర్కొన్నారని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ వల్ల ప్రభుత్వానికి 140 ఎకరాల విలువైన భూమి దక్కుతుందని, అనంతరం వచ్చిన ప్రభుత్వం తుడా ద్వారా సర్వే చేసి అర్హుల జాబితాలు ప్రకటించిందని, అయినా పంచలేదని తెలిపారు. 2023లో శెట్టిపల్లి గ్రామం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం కావడంతో మొత్తం భూమి కార్పొరేషన్‌కు అప్పగిస్తూ జిఓ 610ని విడుదల చేశారని తెలిపారు. అర్హులకు ప్రొసీడింగ్ ఆర్డర్ నెంబరు జి 1170/2023 ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వల్ల భూమిని ప్లాట్లు వేసి లబ్ధిదారులకు అప్పగించడం వాయిదా పడిందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలకు ఇచ్చిన హామీ అమలు కాలేదని వివరించారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించడానికి జోక్యం చేసుకోవాలని సిఎంను కోరారు. పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సెబీ చైర్‌పర్సన్‌ను విచారించం..!

- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌పై ఆర్థిక శాఖ వెల్లడి

మాధబి

న్యూఢిల్లీ : పెట్టుబడులు, మార్కెట్ల రెగ్యులేటరీ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మాధబి పూరీపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలను ఆర్థిక మంత్రిత్వ శాఖ పెడచెవిన పెడుతోంది. అదానీ కంపెనీలు, విదేశీ ఫండ్ కన్సల్టెన్సీ కంపెనీలతో మాధబి, ఆమె భర్తకు ఉన్న సంబంధాలపై ఇటీవల అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ ఓ కీలక రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను పరిశీలించడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉందని కథనాలు వచ్చాయి. కాగా.. దీనిపై మంగళవారం ఆర్థిక శాఖ స్పష్టతనిచ్చింది. మాధబిపై విచారణకు ఎలాంటి ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం లేదని వెల్లడించింది.

సెబీ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు వస్తే మిగితా ఎనిమిది మంది సెబీ బోర్డు సభ్యుల గురించి కూడా ఆలోచించాల్సిందేనని.. అయితే ఆ ఆరోపణల్లో అర్థమే లేదని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌నపై గతంలో వచ్చిన ఆరోపణలపై సెబీ తన విచారణను తప్పించుకుందని హిండెన్‌బర్గ్ విమర్శించింది. ఈ విషయంలో మాధబికి, అదానీ కంపెనీలకు, కన్సల్టెన్సీలకు పరస్పర సంబంధాలున్నాయని ఆరోపించింది.

పిఎస్‌బిలకు ముప్పు..!

కన్సల్టెన్సీ సంస్థలు, అదానీ కంపెనీలతో సెబీ చీఫ్ మాధబి అంటకాగుతోందనే రిపోర్టులు వాస్తవమయితే ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు ప్రమాదం పొంచి ఉందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. బ్యాంకుల వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనంగా ఉండటం ద్వారా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంపొందించడంలో సెబీ పాత్ర అత్యంత కీలకమైంది. ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుండి నిధులను సేకరించే సంస్థల సామర్థ్యాన్ని సెబీ నేరుగా ప్రభావితం చేస్తుంది. ఈ క్రమంలో సెబీ అనుమతులపై బ్యాంక్‌లు ఎక్కువ విశ్వాసం చూపుతాయి. సెబీ ప్రమాణాలకు అనుగుణంగా బ్యాంకులు స్థిరమైన కార్యాచరణతో ఆర్థిక సంక్షోభాల సంభావ్యతను తగ్గిస్తాయి. కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనలకు బ్యాంక్‌లు కట్టుబడి పని చేస్తాయి. ముఖ్యంగా బ్యాంకల విలీనాలు, వాటాల విక్రయాలు, నిధుల సమీకరణ, ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ), ఎఫ్‌పిఒల్లో సెబీ పాత్ర కీలకంగా ఉంటుంది. సెబీ ప్రమాణాలు లోపిస్తే బ్యాంక్‌లకు ప్రమాదం కలిగించడమే కాకుండా ఆ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది.

భవన నిర్మాణాలకు త్వరితగతిన అనుమతులు

- మంత్రి నారాయణ ఆదేశం
- టిడిఆర్ బాండ్ల అక్రమాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం వడ్డేశ్వరంలోని సిడిఎంఎ కార్యాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ, గనులు, అగ్నిమాపక, రిజిస్ట్రేషన్ విభాగాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకూ అనుమతులు ఇస్తున్న విధానాలను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఇక ముందు అన్నిశాఖలనూ అనుసంధానం చేసి ఒకేచోట అనుమతులు ఇచ్చేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. భవన నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకునేవారు ఇక నేరుగా ఒకేచోట చేసుకోవచ్చని వివరించారు. అలాగే నగరాల్లో టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలకు అడ్డుకట్టకు రిజిస్ట్రేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వందల కోట్ల అక్రమాలు చోటు చేసుకున్న టిడిఆర్ బాండ్ల జారీపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని వివరించారు. దీనికోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇంటినెంబర్ల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే భూమికి సంబంధించిని ఇసిలు ఆన్‌లైన్లో నేరుగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ చీఫ్ ఇంజనీరు గోపాలకృష్ణారెడ్డి, రిజిస్ట్రేషన్‌శాఖ ఐజి శేషగిరిబాబు, కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మంత్రి టిజి భరత్



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో ఆయన మాట్లాడుతూ... సిఎం చంద్రబాబు ఒక పారిశ్రామిక బ్రాండ్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి పారిశ్రామిక సంస్థలు తరలి వస్తున్నాయని తెలిపారు. రెండు లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీ సిటీలో పలు సంస్థల ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. వంద రోజుల ప్రభుత్వంలో చంద్రబాబు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు

పాఠశాలల్లో టాయిలెట్ల పరిశుభ్రత అప్‌లోడ్ బాధ్యత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల పరిశుభ్రత ఫోటోలను అప్‌లోడ్ చేసే బాధ్యతను విద్యాశాఖ, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయాల్లో పనిచేసే ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు ప్రతి సోమ, గురువారాల్లో పాఠశాలలను సందర్శించి మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించిన ఫోటోలు తీసి ఐఎంఎంఎస్/సిఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎస్ఓపి యాప్‌ను ప్రభుత్వం సవరించింది. హెడ్‌మాస్టర్ టాయిలెట్ ఫోటోలను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు, హెడ్‌మాస్టర్‌లు ఐఎంఎంఎస్ యాప్‌లో సర్వే ఫార్మట్‌ను ఒకసారి అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించాలని, తద్వారా మాత్రమే అజమాయిషీ చెలాయించే వారినుంచి విముక్తి లభిస్తుందని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎండి జానిపాషా పేర్కొన్నారు. గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులపై ఐదు సంవత్సరాలుగా వివక్ష కొనసాగుతోందన్నారు. మరుగుదొడ్ల ఫోటోలు తీయడానికి పట్టభద్రులెందుకని ఆయన ప్రశ్నించారు.

ఒఎన్‌జిసికి మేఘా అత్యాధునిక డ్రిల్లింగ్ రిగ్ సరఫరా

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఒఎన్‌జిసికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) అత్యాధునిక ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్‌ను అందించింది. రెండువేల అశ్వశక్తి సామర్థ్యంతో హైడ్రాలిక్ ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ (సి3బిఆర్1 ఎన్‌జి 2000-5)ను రాజమండ్రిలోని ఒఎన్‌జిసి చమురు క్షేత్రంలో విజయవంతంగా ఏర్పాటు చేసినట్లు ఎంఇఐఎల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. "ఇది రాజమండ్రి అసెట్‌లో ఒఎన్‌జిసి కోసం తాము ఏర్పాటు చేసిన మూడవ రిగ్ అని పేర్కొంది. ఈ అత్యాధునిక రిగ్ 6000 మీటర్ల లోతువరకు తవ్వగుతుంది. అధిక పీడనాలు, ఉష్ణోగ్రతలు ఉన్న సందర్భాలలో కూడా సమర్థవంతంగా, ప్రమాద రహితంగా పనిచేస్తుంది. ఐదు వేల పిఎస్ఐ వరకు పీడనాన్ని తట్టుకునే ఈ రిగ్ బ్లో ఔట్ ప్రివెంటర్ తో కూడి ఉండడం దీని ప్రత్యేకత. ఇది సంప్రదాయ రిగ్‌లతో పోలిస్తే ఎక్కువ భద్రత, తక్కువ నిర్వహణ ఖర్చుతో కూడినది. ఈ రిగ్ పూర్తిగా ఆటోమేటెడ్‌గా, అధునాతన సాంకేతికతతో మానవ జోక్యం లేకుండా అత్యంత భద్రతతో పనిచేసే విధంగా రూపొందించబడింది. రాబోయే రోజుల్లో ఎంఇఐఎల్ డ్రిల్లింగ్ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించనుంది." అని ఎంఇఐఎల్ పేర్కొంది. ఈ రిగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒఎన్‌జిసి డైరెక్టర్ ఓం ప్రకాశ్ సింగ్, ఎంఇఐఎల్ వైస్ ప్రెసిడెంట్- కాంట్రాక్ట్సు, డ్రిల్‌మెక్ డిప్యూటీ సిఇఒ మార్కో టోజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి రూ.12 లక్షల వేతన ప్యాకేజీ : ట్రైడెంట్ గ్రూపు

న్యూఢిల్లీ : ప్రముఖ టెక్స్‌టైల్, ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల తయారీదారు ట్రైడెంట్ గ్రూపు ఏడాదికి రూ.12 లక్షల వేతన ప్యాకేజీతో, 2 వేల మంది యువతని నియమించుకోనున్నట్లు తెలిపింది. ఇందుకోసం తక్షశిల కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొంది. ప్రధానంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి కొత్త ఉద్యోగుల్ని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించింది. ఐటిఐ, డిప్లొమా, ఇంటర్ విద్యను అభ్యసించిన యువతకు ఒక అద్భుతమైనన వేదికను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రైడెంట్ గ్రూప్ ఛైర్మన్ రాజిందర్ గుప్తా తెలిపారు.

గ్రాన్యూల్స్ ఔషధానికి యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా తయారు చేసిన 'జెనరిక్ గ్లైకో పైరోలేట్ ఓరల్ సొల్యూషన్'కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్‌ఎఫ్‌డిఎ) ఆమోదం లభించింది. నరాల సంబంధిత సమస్యలతో ఉన్న వారు నోరూరడంలో తలెత్తే ఇబ్బందులకు ఇది పరిష్కారం కల్పిస్తుందని ఆ సంస్థ సిఎండి డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు. ఇది రిఫరెన్స్ లిస్టెడ్ డ్రగ్ అన్నారు. ఇది మూడు నుంచి పదహారేళ్ళ వయస్సు గల రోగులకు సూచించే యాంటికోలినెర్జిక్ మందు తెలిపారు. దీంతో అమెరికా మార్కెట్‌లో గ్రాన్యూల్స్ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

శ్రీరామ్ లైఫ్ పాలసీల విక్రయాల్లో 131% వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 131 శాతం వృద్ధితో 1.27 లక్షల వ్యక్తిగత పాలసీలను విక్రయించినట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఓ ప్రకటనలో తెలిపింది. రిటైల్ పాలసీల్లో 7.3 శాతం మార్కెట్ వాటాను చేరుకున్నట్లు పేర్కొంది. నూతన వ్యాపార ప్రీమియం వసూళ్లు 57 శాతం పెరిగి రూ.212 కోట్లుగా నమోదయ్యినట్లు వెల్లడించింది. జూన్ ముగింపు నాటికి కంపెనీ ఆసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.11,841 కోట్లకు చేరింది.

ఒప్పో నుంచి ఎఫ్27 5జి ఆవిష్కరణ

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో మంగళవారం ఒప్పో ఎఫ్27 5జిని విడుదల చేసింది. మీడియా టెక్ డైమెన్సిటీ6300 చిప్‌సెట్, 5000 ఎంఎహెచ్ బ్యాటరీలో ఆవిష్కరించింది. 8జిబి ర్యామ్, 128 జిబి వేరియంట్ ధరను రూ.22,999గా, 256జిబి వేరియంట్ ధరను రూ.24,999గా నిర్ణయించింది. 50 ఎంపి ఒమ్నివిజన్ ఒవి50డి ప్రైమరీ కెమెరా, 32 ఎంపి సెల్ఫీ కెమెరాతో ఆవిష్కరించింది.

సంపాదకీయం

సరైన ప్రతిఘటన

రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తుంగలో తొక్కి, ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ... అణగారిన వర్గాలకు అన్యాయం చేసే... ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పరివార్ అంబులపొదిలోని మరో దుర్మార్గమే లేటరల్ ఎంట్రీ విధానం. ఖాళీగా ఉన్న సివిల్ సర్వీస్ పోస్టులను భర్తీ చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందించడం మాని లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ పరివారంతో, కార్పొరేట్ అత్యాశాపరులతో నింపే ఎత్తుగడ ప్రమాదకరం.

లేటరల్ ఎంట్రీ పేరుతో రిజర్వేషన్లకు అన్యాయం జరుగుతుండటంతో ఇండియా వేదికలోని ప్రతిపక్ష పార్టీలతోపాటు అందులో లేని పార్టీలు... చివరికి అధికార ఎన్‌డిఎ కూటమిలోని లోక్ జనశక్తి (ఎల్‌జెపి) తదితర పార్టీలు ఈ విధానం ఆమోదయోగ్యం కాదని అన్ని వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దిక్కుతోచక తోకముడిచింది. నియామకాల్లో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలు లేవని, వాటిని సమీక్షించి, సంస్కరించాల్సిన అవసరమున్నందు వల్లే ప్రస్తుత ప్రకటనను రద్దు చేస్తున్నామని చెప్పడం ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. దీనిపై మోడీ -2 ప్రభుత్వ హయాంలోనే విమర్శలు వచ్చినా లెక్కచేయలేదు. లోక్‌సభలో సొంత మెజార్టీ వుండడంతో విమర్శలను, అభ్యంతరాలను బేఖాతరు చేసింది. ఇప్పుడా పరిస్థితి లేదు. అదీగాక, త్వరలో జమ్ముకాశ్మీర్, హర్యానా, ఆ తరువాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నందున కాషాయదళం వెనకడుగు వేయక తప్పలేదు. పరిపాలనా వ్యవస్థలో వినాశకరమైన ఈ లేటరల్ ఎంట్రీ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. అంతవరకు ప్రతిపక్షాలు, ప్రజలు ఉద్యమాన్ని కొనసాగించాలి.

యుపిఎస్‌సి పరీక్ష ద్వారా ఐఎఎస్‌లను నియమిస్తారు. అలాకాకుండా సంబంధిత విభాగాల్లో నైపుణ్యం, అనుభవం ఆధారంగా బయటి వ్యక్తులతో ఆ పోస్టులను భర్తీ చేయడాన్ని లేటరల్ ఎంట్రీ అనేది సర్కారు నిర్వచనం. 24 కేంద్ర మంత్రిత్వ శాఖలలోని జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి 45 పోస్టులను లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేసే ప్రక్రియ మూడు రోజుల క్రితం ప్రారంభించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ హయాంలో రెండో పరిపాలనా సంస్కరణల సంఘం (ఎఆర్‌సి), ఆరోవేతన సంఘం (2013) చేసిన సిఫార్సులకు అనుగుణంగా లేటరల్ ఎంట్రీ విధానం ప్రకారం పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించినట్లు మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చెప్పడం సమస్యను పక్కదారిపట్టించే యత్నమే. సామాన్యులను రాబందుల్లా పీక్కుతినే నయా ఉదారవాద విధానాలను నాడు కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ సర్కారు భుజాన మోసినా... నేడు ఎన్‌డిఎ నెత్తిన పెట్టుకున్నా అది దారుణమే! మోడీ నేతృత్వంలోని సర్కారు... లేటరల్ నియామకాల విషయంలో ఆత్రం ఎందుకు ప్రదర్శించింది? స్వామి కార్యం, స్వకార్యం పూర్తవుతుందన్నట్టుగా... తనను అందలమెక్కించేందుకు వేల కోట్లు ఖర్చుపెట్టే అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ల మనుషులను, సమాజాన్ని మత, కుల ప్రాతిపదికన నిలువునా చీల్చే కరడుగట్టిన సంఘపరివార్ వాదులను కేంద్ర ప్రభుత్వ కీలక విభాగాల్లోని ఉన్నతస్థాయి పోస్టుల్లో నియమించేందుకే ఈ తొందర. ఆది నుంచీ రిజర్వేషన్లపై మండిపాటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి విధానం కదా? నాడు మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకిస్తూ... 'మండల్.. కమండల్' అంటూ దేశవ్యాప్తంగా వీరంగం వేసిన చరిత్రా వారిదే! రిజర్వేషన్లిచ్చే ప్రభుత్వరంగాన్నే చాపచుట్టి కార్పొరేట్లకు కట్టబెడుతున్న, దేశవ్యాప్త కులగణనకు మోకాలొడ్డుతున్న వర్తమానమూ వారిదే! ఇప్పటికే గవర్నర్లుసహా రాజ్యాంగంలోని పలు కీలక సంస్థల్లోకి కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ వాదులను చొప్పించిన మోడీ ప్రభుత్వం... సొంతంగా మెజారిటీ లేకపోయినా అవే పద్ధతులను కొనసాగించడం, మనుస్మృతి సామాజిక ఆదేశాన్ని అమలు చేయడమే.

అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లోకి పరివార్ మనుషులను చొప్పించేందుకు 2014లో అధికారానికి వచ్చినప్పటి నుండీ మోడీ సర్కారు తెగబడుతోంది. లేటరల్ ఎంట్రీ విషయంలో వచ్చిన ఐక్య ప్రతిఘటన ప్రభుత్వ మెడలు వంచింది. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ తిరోగమన విధానాలన్నింటినీ తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



మీరు చేసే పని అద్భుతంగా ఉండాలంటే దానిని ప్రేమించడం నేర్చుకోండి.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ప్రసిద్ధ శాస్త్రవేత్త.



నియంత్రణ లేని వాణిజ్యంతో చిక్కులు

"నయా ఉదారవాద చట్రం లోపల ఉంటూ ఎగుమతులను పెంచుకోవాలంటే మన కరెన్సీ మారకపు రేటును తగ్గించుకోవడం అనివార్యం అవుతుంది. అలా చేస్తే, మనం దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరుగుతాయి. వాటిలో మనకు అత్యవసరమైన చమురు వంటివి కూడా ఉన్నాయి. వాటి రేట్లు పెరిగితే ఆ భారం మళ్ళీ వినియోగదారుల మీదే పడుతుంది. దాని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అలా పెరగకుండా చూడడానికి నయా ఉదారవాదం ఒక పరిష్కారాన్ని చూపిస్తుంది. ఒకపక్క మన కరెన్సీ మారకపు రేటును తగ్గించినా, మరొకపక్క కార్మికులకిచ్చే వేతనాల రేటును కూడా తగ్గించి వేస్తుంది. కార్మికుల ఉత్పాదకత పెరిగినా దానితోబాటుగా పెరగవలసిన వేతనాలను పెరగనివ్వదు. కాని ఆ విధంగా చేయడం అన్యాయమే కాదు, అనవసరం కూడా. సంపన్నులు మాత్రమే వినియోగించే వివిధ రకాల విలాస వస్తువుల దిగుమతుల మీద ఆంక్షలు విధిస్తే కార్మికుల వేతనాలను తగ్గించకుండానే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అంటే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచి స్థూల డిమాండ్‌ను కూడా పెంచే దిశగా జోక్యం చేసుకోవచ్చు. ఆ క్రమంలో ఎదురయ్యే విదేశీ మారకపు కొరత సమస్యను పరిష్కరించడానికి కొన్ని దిగుమతుల మీద ఆంక్షలు విధించవచ్చు."

ఏ తరహా ఆర్థిక వ్యవస్థలోనైనా స్థూల డిమాండ్‌కు లోటు ఉండదని, ఎంత మోతాదులో ఉత్పత్తి జరిగితే అది అంతా వినియోగించడానికి తగిన డిమాండ్ ఉంటుందని ఫ్రెంచి ఆర్థికవేత్త జె.బి.సే విశ్వసించాడు. కొన్ని రక్షణ చర్యలు, కొన్ని కోతలు ఉంటాయే తప్ప వ్యవస్థలో ఉత్పత్తి అయ్యే మొత్తం వినియోగించబడుతుందని అతను భావించాడు. దీన్నే 'సే సూత్రం' అంటారు. అయితే ఈ సూత్రం బొత్తిగా అర్థం, పర్థం లేనిది. ఈ సూత్రమే గనుక వాస్తవం అయితే ఆర్థిక వ్యవస్థలో ఎన్నడూ అధికోత్పత్తి సంక్షోభం ఉత్పన్నం అయి వుండేది కాదు.

సే సూత్రాన్ని మార్క్స్ చీల్చి చెండాడాడు. 1930 దశకంలో జె.ఎం.కీన్స్, మిచల్ కాలెక్కీ ఎవరికి వారుగానే, దాదాపు ఒకే సమయంలో ఈ సూత్రం చెల్లదని నిర్ధారించారు. ఐనప్పటికీ, బూర్జువా ఆర్థిక పండితులు పెట్టుబడిదారీ వ్యవస్థలో లోపాలు ఉంటాయని అంగీకరించరు. అందుచేత రకరకాల బూటకపు సిద్ధాంత వ్యూహాలతో సే సూత్రాన్ని తిరిగి సమర్థించడానికి ప్రయత్నిస్తున్నారు. ఐతే ఆ ప్రయత్నాలలో ఎటువంటి శాస్త్రీయతా లేదు.

ఇదంతా ఇప్పుడు ఎందుకు చర్చిస్తున్నాం? స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థించే ప్రతీ వాదనా సే సూత్రం చెల్లుబాటు అవుతుందనే ప్రాతిపదిక మీద నడుస్తుంది. అన్ని ఆర్థిక వ్యవస్థలూ పూర్తి స్థాయిలో ఉపాధి కల్పిస్తాయనే వాదన ప్రాతిపదికగా స్వేచ్ఛా వాణిజ్య సమర్థకులు వ్యవహరిస్తారు. ప్రతీ దేశంలోనూ లభించే వనరులను పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా మొత్తం ప్రపంచ ఉత్పత్తిని స్వేచ్ఛా వాణిజ్యం పెంపొందిస్తుంది అని వారంటారు (ప్రతీ దేశమూ తనకు ఏ యే రంగాల్లో ప్రావీణ్యత ఉందో ఆ రంగాల్లో ప్రత్యేకించి కేంద్రీకరించి ఉత్పత్తి చేస్తుందన్నది వారి వాదన). అందుచేత స్వేచ్ఛా వాణిజ్యం వలన అన్ని దేశాలూ లాభపడతాయని వారంటారు.



ప్రభాత్ పట్నాయక్

ఈ వాదనలకు మూలం సే సూత్రం. ఆ సూత్రమే అసలు చెల్లదు కనుక వీరి వాదనలు సైతం చెల్లవు. పెట్టుబడిదారీ దేశాలు సాధారణంగా పూర్తి స్థాయిలో తమ వనరులను అన్నింటినీ ఉత్పత్తి కోసం వినియోగించలేవు. ఎందుకంటే వాటిలో ప్రతీ దేశంలోనూ దేశీయ డిమాండ్ ఎప్పుడూ ఉత్పత్తి కన్నా తక్కువగానే ఉంటుంది. అందుచేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద కూడా ఉత్పత్తి జరిగిన మేరకు సరిపడా డిమాండ్ ఉండదు. మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌కు కొరత ఉన్న వ్యవస్థగానే ఉంటుంది. అందుచేత స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ఒక దేశం తన ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచుకోవడం గనుక జరిగితే మరేదో దేశంలో ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు తగ్గిపోక తప్పదు. అంటే, స్వేచ్ఛా వాణిజ్యం వలన దేశాల మధ్య పీకలు తెగిపోయేంత తీవ్రమైన పోటీ నెలకొంటుంది. తక్కిన దేశాలకన్నా ముందే తన సరుకుల్ని అమ్మేసుకోవాలని ప్రతీ దేశమూ తాపత్రయపడుతుంది.

అందుచేత నయా ఉదారవాదం అనుసరించే వృద్ధి వ్యూహం మౌలికంగానే అనైతికమైనది, అంగీకరించకూడనిది. ఈ వ్యూహం మూడో ప్రపంచ దేశాలు ఒకదానితో ఇంకొకటి పోటీ పడేట్టు చేస్తుంది. ఇది పూర్తిగా బూర్జువా వ్యూహం. పెట్టుబడిదారుడు కార్మికులు ఒకరితో మరొకరు పోటీ పడేట్టు చేస్తాడు (ఆ కార్మికులు సంఘాలుగా ఏర్పడి బూర్జువా వర్గాన్ని ఎదిరించేదాకా ఈ పోటీ సాగుతూనే వుంటుంది. ఆ తర్వాత కూడా కార్మికులకు, నిరుద్యోగులకు మధ్య పోటీ తప్పదు). అదే మాదిరిగా నయా ఉదారవాదం మూడో ప్రపంచ దేశాలు ఒకదానితో మరొకటి పోటీ పడేట్టు చేస్తాయి. వలస పాలనకు వ్యతిరేకంగా ఏ దేశానికి ఆ దేశం పోరాడుతున్నప్పుడు వాటి మధ్య ఒక విధమైన ఐక్యత, సౌహార్ద్రత పెంపొందాయి. నేటికీ ఆ ఐక్యత, సౌహార్ద్రత ఎంతో అవసరం. అది ఉంటేనే అవి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలదొక్కుకోగలవు. వాస్తవానికి మానవ సమాజం పురోగమించాలంటే కావలసినది పరస్పర సహకారమే తప్ప పరస్పర పోటీ కానే కాదు. కాని నయా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేక దిశలో నడవాలని ఒత్తిడి చేస్తుంది. ఇది నైతికంగా అభ్యంతరకరం.

ఈ విధంగా అభ్యంతరం చెప్పడానికి మరొక కారణం కూడా ఉంది. నయా ఉదారవాద విధానాల అనుభవం బట్టి చూస్తే స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో అన్ని రకాల నియంత్రణలనూ తొలగించడంతో బాటు పెట్టుబడుల రాక పోకల మీద ఆంక్షలనూ తొలగించడం జరుగుతోంది. అలా చేయకపోతే లావాదేవీల చెల్లింపులో లోటును భర్తీ చేయడం చాలా దేశాలకు అసాధ్యం అయిపోతుంది. ఐతే ఈ విధంగా ఆంక్షలను తొలగించడం వలన ప్రపంచ పెట్టుబడుల ప్రవాహ తాకిడికి ప్రతీ దేశమూ గురౌతుంది. దాని వలన అక్కడి ప్రభుత్వం బలహీనపడుతుంది. తన దేశంలో ఉత్పత్తిని పెంచడానికి గాని, ఉపాధి అవకాశాలను పెంచుకోడానికి గాని జోక్యం చేసుకోలేని స్థితిలో పడిపోతుంది.

తమ అదుపులో లేని అదృశ్య శక్తుల మీద ప్రజల జీవన ప్రమాణాలు ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఆ అదృశ్య శక్తులే ప్రపంచ స్థూల డిమాండ్‌ను నిర్ధారిస్తాయి. స్వతంత్రం వచ్చాక తమ ఆర్థిక భవిష్యత్తును తామే నిర్ణయించుకోగలుగుతామని విశ్వసించిన ప్రజలు వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్యయుతంగా తమ ఆకాంక్షలను, కోర్కెలను ప్రతిబింబించే ప్రభుత్వాలు ఏర్పడతాయని, అవి తమ కోర్కెలను నెరవేరుస్తాయని వారు భావించారు. కాని నయా ఉదారవాద దశలో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వాలు కాకుండా, పోటీ ప్రపంచపు స్వత:సిద్ధ నియమాలు నిర్ధారించడం మొదలౌతుంది. ప్రజలు ఒక మేరకు తమ దేశ రాజకీయాలను నిర్ణయించగలుగుతారు. కాని ఆ రాజకీయాలతో దేశ ఆర్థిక వ్యవస్థను నియంత్రించలేని, ప్రభావితం చేయలేని పరిస్థితి వస్తుంది. అంటే వలస పాలన కాలం నాటి నిర్బంధ పరిస్థితి మళ్ళీ ఏర్పడుతుందన్నమాట. స్వతంత్ర దేశంలో ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోలేని స్థితి రావడం అంటే అది నైతికంగా చాలా అభ్యంతరకరమైనది.

ఈ నైతిక అభ్యంతరాలను పక్కన పెట్టి కేవలం ఆర్థిక కోణం నుండే పరిశీలించినా, సే సూత్రం కొరగానిదిగానే తేలుతుంది. ఎటువంటి నియంత్రణా లేని వాణిజ్యం మీద ఆధారపడి రూపొందించిన వృద్ధి వ్యూహం కన్నా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే వ్యూహమే అన్ని రకాలుగా మిన్నగా ఉంటుంది. ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో ఉత్పత్తికి తగిన మోతాదులో డిమాండ్ లేదు అంటే దానర్థం ప్రపంచంలో కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలలో (అన్నింటిలోనూ ఉండాలని లేదు) డిమాండ్‌కు కొరత ఉందని అర్థం. మూడవ ప్రపంచ దేశాల విషయానికి వస్తే అవన్నీ సాధారణంగా స్థూల డిమాండ్ తగినంత లేక కొరతతోనే ఉంటాయి. నయా ఉదారవాద విధానాల అమలు అనంతరం ఇది ఆ దేశాలకు సర్వ సాధారణ లక్షణం అయిపోయింది. అటువంటప్పుడు అక్కడ ప్రభుత్వాలు జోక్యం చేసుకుని స్థూల డిమాండ్‌ను పెంచే చర్యలు తీసుకుంటే మూడవ ప్రపంచ దేశాల పరిస్థితి తప్పకుండా మెరుగౌతుంది. ఉపాధి అవకాశాలు పెరిగి ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అటువంటి పరిస్థితి స్వేచ్ఛా వాణిజ్యం అమలౌతుంటే సాధ్యం కాదు.

అయితే ఇక్కడ మూడు మినహాయింపులు అవసరం. మనం మూడవ ప్రపంచం మొత్తం మీద అన్నింటినీ కలిపి మాట్లాడుతున్నాం. కాని ఈ మూడవ ప్రపంచ దేశాలలో కొన్ని ఇప్పటికే ఎగుమతుల పెంపుదలలో విజయవంతం అయి వుండవచ్చు. వాటి ఉత్పత్తి ఇప్పటికే చాలా ఎక్కువగా ఉండి ఆ దేశాలలో స్థూల డిమాండ్ మరి అదనంగా పెరిగే అవకాశాలు దాదాపు లేకపోవచ్చు. కాని తక్కిన మూడవ ప్రపంచ దేశాలు కూడా అదే విధంగా విజయవంతం కావడం ఇక సాధ్యపడదు. ఒకానొక వ్యక్తి లాటరీలో ప్రైజ్ మనీ గెలుచుకున్నాడు కాబట్టి లాటరీ టిక్కెట్లు కొన్న వారందరూ గెలుచుకోవడం ఎలా సాధ్యం కాదో ఇదీ అంతే.

రెండవ విషయం: మూడవ ప్రపంచ దేశాలలో విజయవంతం అయిన దేశాలు అక్కడ ప్రభుత్వాలు ఎగుమతులను పెంచే విషయంలో బలంగా జోక్యం చేసుకున్నాయి గనుకనే వాటి విజయం సాధ్యపడింది. ఆ ప్రభుత్వాలు గనుక స్వేచ్ఛా వాణిజ్య సూత్రాన్ని పాటించి జోక్యం చేసుకోకుండా వదలివేసినట్లయితే ఈ విజయం సాధ్యపడేది కాదు. దీనిని పట్టుకుని కొందరు అన్ని దేశాలలోనూ ఎగుమతులను ప్రోత్సహించే వాణిజ్య వ్యూహాన్ని అనుసరించాలని వాదిస్తున్నారు. కాని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగా డిమాండ్ కొరతతో ఉన్నప్పుడు ఒక దేశంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎగుమతులను పెంచడానికి పూనుకుంటే అప్పుడు అనివార్యంగా వేరే ఇంకొక దేశపు వ్యాపారం దెబ్బ తింటుంది. పరస్పర సహకారం ఉంటే తప్ప మూడవ ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలవరించలేవు అని అనుకున్నప్పుడు వాటిలో వాటికి పోటీ పెట్టే వాదన ముందుకు తేవడం నైతికంగా అభ్యంతరకరమే గాక ఆర్థిక సూత్రాలను బట్టి చూసినా, మూడవ ప్రపంచ దేశాలన్నీ వృద్ధి చెందడానికి ఈ వ్యూహం ఎంతమాత్రమూ తోడ్పడదు.

మూడవది: ఇప్పటికే మూడవ ప్రపంచ దేశాలలో జరుగుతున్న ఉత్పత్తి వాటికున్న సామర్థ్యం కన్నా చాలా తక్కువ స్థాయిలో ఉంది. ఇటువంటప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని స్థూల డిమాండ్‌ను పెంచే దిశగా, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ప్రయత్నిస్తే అప్పుడు విదేశీ మారకద్రవ్య నిల్వలలో లోటు పెరుగుతుంది. అందుచేత ఎగుమతులను పెంచడం తప్ప వేరే వ్యూహం ఏదీ మనకు కనిపించదు. కేవలం దేశీయ డిమాండ్‌ను పెంచినంత మాత్రాన సరిపోదు. ఇలా నయా ఉదారవాద చట్రం లోపల ఉంటూ ఎగుమతులను పెంచుకోవాలంటే మన కరెన్సీ మారకపు రేటును తగ్గించుకోవడం అనివార్యం అవుతుంది. అలా చేస్తే, మనం దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరుగుతాయి. వాటిలో మనకు అత్యవసరమైన చమురు వంటివి కూడా ఉన్నాయి. వాటి రేట్లు పెరిగితే ఆ భారం మళ్ళీ వినియోగదారుల మీదే పడుతుంది. దాని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అలా పెరగకుండా చూడడానికి నయా ఉదారవాదం ఒక పరిష్కారాన్ని చూపిస్తుంది. ఒకపక్క మన కరెన్సీ మారకపు రేటును తగ్గించినా, మరొకపక్క కార్మికులకిచ్చే వేతనాల రేటును కూడా తగ్గించి వేస్తుంది. కార్మికుల ఉత్పాదకత పెరిగినా దానితోబాటుగా పెరగవలసిన వేతనాలను పెరగనివ్వదు.

కాని ఆ విధంగా చేయడం అన్యాయమే కాదు, అనవసరం కూడా. సంపన్నులు మాత్రమే వినియోగించే వివిధ రకాల విలాస వస్తువుల దిగుమతుల మీద ఆంక్షలు విధిస్తే కార్మికుల వేతనాలను తగ్గించకుండానే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అంటే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచి స్థూల డిమాండ్‌ను కూడా పెంచే దిశగా జోక్యం చేసుకోవచ్చు. ఆ క్రమంలో ఎదురయ్యే విదేశీ మారకపు కొరత సమస్యను పరిష్కరించడానికి కొన్ని దిగుమతుల మీద ఆంక్షలు విధించవచ్చు. ఇదంతా సాధ్యమే (దానితోబాటు పెట్టుబడుల రాక, పోకల మీద కూడా ఆంక్షలు విధించాలి). విదేశీ రుణ భారం భరించలేనంతగా పెరిగిపోయిన దేశాల విషయంలో కూడా ఈ వ్యూహాన్ని అనుసరించవచ్చు. తీర్చవలసిన రుణాలలో ప్రాధాన్యత ప్రకారం చెల్లించే విధానాన్ని అనుసరిస్తే దీనికి ఒక దారి దొరుకుతుంది.

కాని ఈ విధమైన వ్యూహాన్ని అనుసరించడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఎంతమాత్రమూ అంగీకరించదు. దాని వెనుక ఉన్న బలమైన దేశాలూ అంగీకరించవు. కాని వాళ్ళు ప్రబోధిస్తున్న ఆర్థిక సిద్ధాంతం యావత్తూ ఎంత లోపభూయిష్టమో మనం ఇప్పుడు చూశాం. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సంపన్న పశ్చిమ దేశాలు ఆదేశించినదానికల్లా తలాడించడం కాకుండా మూడవ ప్రపంచ దేశాలు విడివిడిగా కాని, అందరూ కలిసికట్టుగా కాని తమ తమ దేశాల్లో స్థూల డిమాండ్‌ను పెంచేవిధంగా ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రయత్నించాలి. విదేశీ మారకద్రవ్యం దేశ అవసరాల ప్రాధాన్యత రీత్యా ఖర్చు చేసే నియంత్రణను పాటించాలి.

(స్వేచ్ఛానుసరణ)

అంతర్జాతీయం

అమెరికా అధ్యక్ష ఎన్నికలు: ట్రంప్, కమల హోరాహోరీ!



"అమెరికా ఎన్నికల్లో పోటీ పడుతున్న రెండు ప్రధాన పార్టీలూ వర్గరీత్యా బహుళజాతి గుత్త సంస్థలు, ఆయుధ తయారీదార్లకు అనుకూలమైనవే. ఎవరి హయాంలో ఎక్కడ చిచ్చు పెట్టినా అధికార మార్పిడితో నిమిత్తం లేకుండా ఎవరు గెలిచినా దాన్ని ఆరకుండా చూడటంలో దొందూ దొందే. అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్కరించటంలో రెండు పార్టీలూ విఫలమయ్యాయి. ఈ కారణంగానే పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావన అక్కడ రోజు రోజుకూ పెరుగుతోంది."

చికాగో నగరంలో జరిగిన డెమోక్రటిక్ పార్టీ సమావేశం తన అధ్యక్ష అభ్యర్థిగా కమలా దేవి హారిస్‌ను ప్రకటించింది. ప్రచారంలో తొలుత అభ్యర్థిగా ఉన్న జో బైడెన్ తడబడటం, పొంతన లేకుండా మాట్లాడటం వంటి పరిణామాల పూర్వ రంగంలో కమల రంగంలోకి వచ్చింది. నవంబరు ఐదవ తేదీన జరిగే ఎన్నికలకు ముందు సెప్టెంబరు పదవ తేదీన, తరువాత జరిగే చర్చల్లో ఆమెను ఎదుర్కొనేందుకు మాజీ ఎంపీ తులసీ గబ్బార్డ్ సాయం తీసుకోవాలని ట్రంప్ నిర్ణయించాడు. పార్టీలకు వేసే ఓట్లను బట్టిగాక ఎలక్టరల్ కాలేజీలో తెచ్చుకొనే ఓట్లే అధ్యక్ష పదవిలో కూర్చునే వారిని నిర్ణయిస్తాయి. అలాంటి ఓట్లు 538 కాగా, గెలవాలంటే 270 కావాలి. ఆగస్టు నెల 18వ తేదీన ఉన్న పరిస్థితిని బట్టి కమలా హారిస్ 225, డోనాల్డ్ ట్రంప్ 219 ఓట్లతో పోటీ పడుతున్నట్లు ఒక సర్వే వెల్లడించింది. మరికొన్ని కూడా అదే విధమైన వివరాలను ఇస్తున్నాయి. ఎన్నికల నాటికి ఈ అంకెలన్నీ మారిపోతుంటాయి. రెండు పార్టీలకు సాంప్రదాయంగా బలమైన కొన్ని రాష్ట్రాలు ఉన్నాయి. ఎటూ మొగ్గని చోట పలుకుబడి పెంచుకొనేందుకు అభ్యర్థులు పోటీ పడతారు. ఈ క్రమంలో ప్రచారంలో ఎన్నో అవాస్తవాలు, దిగజారుడు పద విన్యాసాలు, వినిపిస్తాయి, కనిపిస్తాయి. ట్రంపు ఏం మాట్లాడతాడో తెలియదు. గతంలో బైడెన్ ఒక దొంగ, మోసగాడు, అబద్ధాల కోరు, చరిత్రలో చెత్త అధ్యక్షుడు అంటూ నోరు పారవేసుకున్న పెద్ద మనిషి ఇప్పుడు కమలా హారిస్ మీద కూడా అదే మాదిరి దాడి చేస్తున్నాడు. ఆమె కూడా దొంగ, అబద్ధాల కోరు, ఆమె నిజంగా నల్ల జాతీయురాలు కాదు కానీ ఇప్పుడు అలా చెప్పుకుంటున్నది. ఆమె తన పేరును కూడా సరిగా ఉచ్ఛరించలేదు, ఆమె అసమర్థురాలు అని మాట్లాడాడు. ఆమె సభలకు జనం రావటం లేదు, కృత్రిమ మేథ ద్వారా పెద్ద ఎత్తున జనం ఉన్నట్లు చిత్రిస్తున్నారు అన్నాడు.

ఎం. కోటేశ్వరరావు

అమెరికా ఎన్నికల్లో పోటీ పడుతున్న రెండు ప్రధాన పార్టీలూ వర్గరీత్యా బహుళజాతి గుత్త సంస్థలు, ఆయుధ తయారీదార్లకు అనుకూలమైనవే. ఎవరి హయాంలో ఎక్కడ చిచ్చుపెట్టినా అధికార మార్పిడితో నిమిత్తం లేకుండా ఎవరు గెలిచినా దాన్ని ఆరకుండా చూడటంలో దొందూ దొందే. అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్కరించటంలో రెండు పార్టీలూ విఫలమయ్యాయి. ఈ కారణంగానే పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే భావన అక్కడ రోజు రోజుకూ పెరుగుతోంది. కొన్ని సామాజిక సమస్యల్లోనే రెండు పార్టీల మధ్య తేడాలు ఉన్నాయి. అక్కడి వామపక్ష శక్తులు, ఉదారవాదులు ఏ రాక్షసుడితో తక్కువ ముప్పు అని చూసి...చిన్న రాక్షసుడిగా ఉండే డెమోక్రటిక్ పార్టీకి మద్దతు ఇస్తుంటారు.

కీలకమైన రాష్ట్రాలలో కమలా హారిస్‌ది పైచేయిగా కనిపించటంతో ట్రంప్ రెచ్చిపోతున్నాడు. పెన్సిల్వేనియా రాష్ట్రంలో జరిగిన సభల్లో మాట్లాడుతూ సలహాదారులు రాసి ఇచ్చిన ప్రసంగాన్ని పక్కన పెట్టి కమలా హారిస్ కమ్యూనిస్టు, ఫాసిస్టు ఎజెండాలను పాటిస్తున్నారని ఆరోపించాడు. ట్రంప్ ప్రసంగం విసుగు పుట్టించి సభికులు మధ్యలోనే లేచి వెళ్లిపోతుండటంతో కమలా హారిస్ మీద వ్యక్తిగత దూషణలతో ఆకర్షించేందుకు చూశాడు. జో బైడెన్ పాలనలో ధరలు పెరిగాయని, కుటుంబాల మీద పెరిగిన భారాన్ని "కమలా హారిస్ ద్రవ్యోల్బణ పన్ను" అని, కామ్రేడ్ కమల ముందు రోజు చేసిన ప్రసంగంలో ఒక కమ్యూనిస్టు మాదిరి మాట్లాడారని, సోషలిస్టు వ్యవస్థలో మాదిరి ధరల నియంత్రణ కోరుతున్నారని, అంటే సరకుల కొరత, ఆకలి, ధరల పెరుగుదల అని ఆరోపించాడు. ఆమెను బైడెన్ ద్వేషిస్తాడు, అతగాడి మీద కుట్ర చేసి ఆమె అభ్యర్థిగా నిలిచారన్నాడు. పోటీ నుంచి తప్పుకున్న జో బైడెన్ గురించి ఎక్కువగా మాట్లాడవద్దని వారిస్తున్నా ట్రంప్ ఆగలేదు. నేను అతన్ని దెబ్బ తీశాను గనుక, ఇప్పుడు ఆమెను కూడా అదే చేయకపోవటం అన్యాయం అంటూ కేకలతో వీరంగం వేశాడు. ప్రత్యర్థులను ఇరుకున పెట్టబోయి తానే ఇరుక్కున్నట్లు విమర్శకులు పేర్కొంటున్నారు.

ఎన్నికల్లో ఒకవేళ ఓడిపోతే ఓటమిని అంగీకరించకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే పూర్వ రంగాన్ని సిద్ధం చేసుకుంటున్నాడని డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ తాజాగా ట్రంప్ గురించి ఓటర్లను హెచ్చరించాడు. మిచిగన్ విమానాశ్రయంలో పెద్ద ఎత్తున కమలా హారిస్ ఆమె ఉపాధ్యక్ష అభ్యర్థి, మినెసోటా గవర్నర్ వాల్జ్‌కు వేలాది మంది స్వాగతం పలికారు. మీడియా దాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. అదంతా కృత్రిమ సృష్టి అని వర్ణించిన ట్రంప్ వెర్రివాడిలా కనిపించవచ్చు గాని బుద్ధిహీనుడు కాదని, తెలివిగా ఓటమిని తిరస్కరించేందుకు పథకం వేస్తున్నాడని శాండర్స్ అన్నాడు. ప్రజాస్వామ్యాన్ని తక్కువ చేయటం ఫాసిజం తప్ప మరొకటి కాదని, అందుకే ట్రంప్‌ను ఓడించేందుకు చేయాల్సిందంతా చేయాలని శాండర్స్ అన్నాడు. గత ఎన్నికలలో ఓడిన తరువాత ఓటమిని అంగీకరించని ట్రంప్ 2021 జనవరి ఆరవ తేదీన అమెరికా అధికార కేంద్రంపైకి తన అనుచరులను ఉసిగొల్పిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ ఆ కేసుల విచారణ కొనసాగుతున్నది. కమల-వాల్జ్ రంగంలోకి దిగటంతో అంతకు ముందు బైడెన్ మీద ఉన్న వ్యతిరేకత, హత్యాప్రయత్నంతో వచ్చిన ఆధిక్యత ఆవిరైపోతుండటంతో గతాన్ని పునరావృతం కావించేందుకు పూనుకున్నాడని అనేక మంది భావిస్తున్నారు.

జో బైడెన్‌తో జరిపిన తొలి సంవాదం సందర్భంగా ట్రంప్ ఇతరుల సాయం తీసుకున్నాడు. మారిన పరిస్థితుల్లో కమలా హారిస్‌తో ఎన్నికల సంవాదానికి డోనాల్డ్ ట్రంప్‌కు మాజీ మిలిటరీ అధికారిణి, డెమోక్రటిక్ పార్టీ మాజీ పార్లమెంటు సభ్యురాలు, తరువాత రిపబ్లికన్ పార్టీకి ఫిరాయించిన తులసీ గబ్బార్డ్ సాయం కావాల్సి వచ్చింది. డెమోక్రటిక్ పార్టీలో ఉండగా కమలా హారిస్ మంచి చెడ్డలు, ఆమె రాజకీయ, ఇతర అంశాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి తులసి. 2020లో అధ్యక్ష పదవి అభ్యర్థిత్వం కోసం కమలా హారిస్‌తో పాటు పార్టీలో పోటీ పడింది. 2022లో ఆమె రిపబ్లికన్ పార్టీలో చేరింది. అందుకే ట్రంప్ ఆమెను ఎంచుకున్నాడు. తులసి తిరోగమన భావాలు ట్రంప్‌కు ప్రతిరూపంగా ఉంటాయి. తులసీ గబ్బార్డ్‌ను ఎంచుకోవటంలో తనకూ కమలతో సమానమైన మహిళ తులసి మద్దతు ఉందని చెప్పుకొనేందుకు, అమెరికాలో స్థిరపడిన హిందువుల ఓట్ల వేట కూడా ఇమిడి ఉంది. కమలా హారిస్ భారతీయ మూలాలు ఉన్న ఆఫ్రికన్. డెమోక్రటిక్ పార్టీలో ఉన్నపుడు 2020 ఎన్నికల్లో పార్టీలో కమలతో పోటీ పడి ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. అయితే కమల కంటే తులసికి తక్కువ ఓట్లు వచ్చాయి. తరువాత ఇద్దరూ పోటీ నుంచి తప్పుకొన్నారు. జో బైడెన్ తన ఉపాధ్యక్ష అభ్యర్థిగా కమలను ఎంచుకోవటంతో సహించలేక తరువాత తులసీ పార్టీ ఫిరాయించారు. మీడియా సర్వేలు ఇప్పటి వరకు ఇచ్చిన విశ్లేషణల ప్రకారం కమలా హారిస్ ముందంజలో ఉన్నారు.

జనవాక్యం

అప్రమత్తంగా వ్యవసాయ శాఖ

ఎగువ రాష్ట్రాల్లో, రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. అయితే వ్యవసాయ శాఖ రైతులకు విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాయల సీమ, ఉత్తరాంధ్ర, నాగార్జున సాగర్ ఆయకట్టులో రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు సాగునీటి సరఫరా, పంటల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. అదునులో విత్తనం, నీరు, ఎరువు పడకుంటే రైతు పడిన కష్టం వృధా అవుతుంది. ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి శాఖల పనితీరులో వేగం, నాణ్యత పెరిగేలా గట్టి ఆదేశాలు ఇవ్వాలి. రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయం లాభసాటిగా మారేలా చూడాలి.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా.

చిన్నారులపై వేధింపులు

- మహారాష్ట్ర థానేలో దారుణం
- టాయిలెట్‌లో స్వీపర్ దుర్మార్గంపై తల్లిదండ్రులు సహా స్థానికుల రైల్‌రోకో
- ఏడుగంటలుగా నిలిచిన రైళ్లు
- ఆందోళనకారులపై లాఠీఛార్జి
- బాద్లాపూర్‌కు బాలల హక్కుల కమిషన్ బృందం

బాద్లాపూర్ రైల్వేస్టేషన్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల అందోళన

థానే: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనపై నిరసనలు హోరెత్తుతుండగానే, మరోపక్క మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఒక స్కూల్లో అభం శుభం తెలియని నాలుగేళ్ళ వయసున్న ఇద్దరు చిన్నారులపై టాయిలెట్‌లో ఓ స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహారాష్ట్రను కుదిపేస్తోంది. ఈ సంఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబికింది.

థానే జిల్లా బాద్లాపూర్‌లోని ఒక స్కూల్లో గత వారం జరిగిన ఈ సంఘటనపై న్యాయం కావాలని కోరుతూ చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ స్థానిక రైల్వే స్టేషన్ వద్ద తల్లిదండ్రులతో సహా స్థానికులు రైల్‌రోకో చేపట్టారు. ఉదయం 8గంటల సమయంలో బాద్లాపూర్‌రైల్వే స్టేషన్‌కు వచ్చిన బాధితుల తల్లిదండ్రులు, స్థానికులు రైలు పట్టాలపై బైఠాయించారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు రైళ్ల రాకపోకలు సాగనివ్వబోమని వారు పట్టుబట్టారు. పోలీసులు లాఠీలు ఝుళిపించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపుగా ఏడు గంటలుగా ఆందోళనలు కొనసాగుతుండడంతో ఆ ప్రాంతంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దూరప్రాంతాలకు వెళ్లే పది రైళ్లను దారిమళ్లించినట్లు సెంట్రల్ రైల్వే తెలిపింది.

అసలేం జరిగింది..?

బాద్లాపూర్‌లోని పాఠశాలలో గత వారం ఈ లైంగిక వేధింపుల ఘటన చోటు చేసుకుంది. కిండర్ గార్టెన్‌లో చదువుతున్న మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలు టాయిలెట్‌లో వున్న సమయంలో దానిని శుభ్రం చేసే వంకతో ఒక స్వీపర్ వారి వద్దకు వెళ్లి అనుచితంగా ప్రవర్తించాడు. తర్వాత ఒక బాలిక తన అంతర్గత అవయవాల వద్ద నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మరో బాలిక పాఠశాలకు వెళ్లాలంటే భయపడింది. దీంతో తల్లిదండ్రులు వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్లగా వారిపై వేధింపులు జరిగినట్టు తేలింది. దీనిపై ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌కు వెళ్లగా వారు మొదట చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాదాపు 11 గంటల పాటు వేచివున్న తర్వాత చివరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని ఈ నెల 17న అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా పాఠశాల నిర్వహణలోని లొసుగుల, లోపాలు బయట పడ్డాయి. బాలికల టాయిలెట్ నిర్వహణకు మహిళా సిబ్బందిని కేటాయించలేదని, పలు సిసి టీవీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని వెల్లడైంది.

ప్రత్యేక దర్యాప్తు బృందం... ముగ్గురు పోలీసు అధికారుల సస్పెన్షన్

ఆందోళనల నేపథ్యంలో బాద్లాపూర్ స్కూలు యాజమాన్యాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. స్కూలు ప్రిన్సిపల్, ఇద్దరు టీచర్లపై కూడా వేటు వేసింది. బాలికల తల్లిదండ్రులు ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చినా తీసుకోవడానికి నిరాకరించిన సీనియర్ పోలీసు ఇనస్పెక్టర్‌తో సహా ముగ్గురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సిఎం, హోం మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఐజి ర్యాంకు కలిగిన మహిళా ఐపిఎస్ అధికారి ఆర్తి సింగ్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. ఘటనపై వీలైనంత త్వరగా విచారించాలని, చార్జిషీట్‌ను దాఖలు చేయాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా థానే పోలీసు కమిషనర్‌ను ఫడ్నవిస్ ఆదేశించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. జరిగిన సంఘటనకు స్కూలు యాజమాన్యం క్షమాపణలు తెలిపింది. హౌస్‌కీపింగ్ కాంట్రాక్ట్ తీసుకున్న కంపెనీని బ్లాక్ లిస్ట్‌లోపెట్టి ఆ కాంట్రాక్టును రద్దు చేసినట్లు పేర్కొంది. బాధితులు వచ్చినపుడు సరిగా వ్యవహరించని పోలీసు స్టేషన్ ఇన్‌చార్జిని బదిలీ చేశారు.

ఆగని ఆందోళనలు

నిందితుడిని ఉరి తీయాల్సిందేనని, అప్పుడే తమకు న్యాయం జరిగినట్లవుతుందని డిమాండ్ చేస్తూ బాధిత తల్లిదండ్రులు సహా ఆ స్కూల్లో చదువుతున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అందరూ కలిసి మంగళవారం ఉదయం స్కూలు వెలుపల ధర్నా చేశారు. బ్యానర్లు, ప్లకార్డులు చేబూని పెద్ద సంఖ్యలో మహిళలు పట్టాలపై బైఠాయించారు. పరిస్థితిని అదుపుచేయడం పోలీసులకు, అధికారులకు కూడా కష్టంగా మారింది. ఆందోళనకారులను శాంతింపచేసేందుకు ఇంకా ప్రయత్నాలు కొనసాగుతునే వున్నాయి. ఈ సంఘటనకు నిరసనగా పలు సంస్థలు బాద్లాపూర్ బంద్‌కు పిలుపిచ్చాయి. స్థానిక ఎంఎల్‌ఎ కిషన్ కాథోర్ కూడా ఈ విషయమై అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఇక నిరసన చేస్తోన్న తల్లిదండ్రులకు మద్దతుగా మంగళవారం అన్ని పాఠశాలలను మూసివేశారు. ఒక దశలో ఆందోళనకారులు రెచ్చిపోయి స్కూలు విధ్వంసానికి దిగారు. ఈ పరిణామాలపై స్పందించిన బాలల హక్కుల జాతీయ కమిషన్, దర్యాప్తు నిమిత్తం బాద్లాపూర్‌కు ఒక బృందాన్ని పంపాలని నిర్ణయించింది.

హ్యాంగ్.. హ్యాంగ్.. నినాదాల హోరు

ఆందోళనకారులను శాంతింపజేసేందుకు మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన నిందితుడిని ఉరితీయాల్సిందేనంటూ ఆందోళనకారులు నినదించారు. రైల్వే ట్రాక్‌లను ఖాళీ చేయాలంటూ మంత్రి విజ్ఞప్తి చేసినా.. 'హ్యాంగ్.. హ్యాంగ్' అంటూ నినాదాలతో ఆ పరిసరాలను హోరెత్తించారు.

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా దిగ్భ్రాంతి చెందిందని, నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరసనకారుల డిమాండ్లకనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. అయినా ఆందోళనకారులు నిరసనల్ని విరమించలేదు.

అది బూటకపు లేఖ !

- కోల్‌కతా కేసులో సిబిఐ వెల్లడి
- మాజీ ప్రిన్సిపల్ ఆర్థిక అవకతవకలపై పోలీసుల దర్యాప్తు

కోల్‌కతా : రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కోల్‌కతా డాక్టర్ అత్యాచారం, హత్య కేసు దర్యాప్తు నుండి సిబిఐ వైదొలగుతున్నట్లు పేర్కొంటూ బయటకు వచ్చిన ఒక లేఖ నకిలీదని, నమ్మవద్దని సిబిఐ పేర్కొంది. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆ లేఖలోని విషయాలన్నీ అసత్యాలేనని సిబిఐ తెలిపింది. అందులోని సమాచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని స్పష్టం చేసింది. కోల్‌కతా క్రైమ్ బ్రాంచ్ డిఐజి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆకాష్ నాగ్ పేరుతో ఆ లేఖ వెలువడింది. సిబిఐ, డిఐజి కార్యాలయం, అవినీతినిరోధక శాఖ, కోల్‌కతా అనే లెటర్ హెడ్‌తో ఆ లేఖ సోషల్‌మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. ఆ లేఖ, అందులోని సమాచారం పూర్తిగా బూటకమని, ఢిల్లీ సిబిఐ హెడ్‌క్వార్టర్స్ స్వయంగా ఈ కేసును దర్యాప్తు చేస్తోందని సిబిఐ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. అసలు ఆకాష్ నాగ్ అనే పేరు గల వ్యక్తి సిబిఐలో లేరని స్పష్టం చేసింది.

ఆస్పత్రి, ప్రిన్సిపల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు

ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఆరోపణలపై కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలో 2021 నుండి జరిగిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తుకు నలుగురు సభ్యులతో బెంగాల్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది ఆ వెంటనే ఘోష్‌పై కూడా దర్యాప్తు ప్రారంభమైంది. ఈ విషయమై ఘోష్‌కు పోలీసులు సమన్లు జారీ చేసే అవకాశం వుంది. డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా బుధవారం నుండి ఐదు రోజుల పాటు కోల్‌కతా నగరంలోని శ్యామ్ బజార్ మెట్రోస్టేషన్ సమీపంలో ప్రదర్శన నిర్వహించడానికి షరతులతో బిజెపిని ఐదు రోజుల పాటు కలకత్తా హైకోర్టు అనుమతించింది.

కీలకమైన డిమాండ్లన్నీ నెరవేరినందున తమ సమ్మెను విరమిస్తున్నట్లు రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రికి చెందిన రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. సుప్రీం తీర్పును డాక్టర్స్ ఫెడరేషన్ స్వాగతించింది.

విమర్శకుల నోరునొక్కేందుకే

- పిఎస్‌ఎఫ్‌పై టిఐఎస్‌ఎస్ నిషేధాన్ని ఖండించిన ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐకెఎస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో :

విమర్శకుల నోరు నొక్కేందుకే ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్‌ఎస్) యాజమాన్యం ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్ (పిఎస్‌ఎఫ్)పై అప్రజాస్వామికంగా నిషేధం విధించిందని ఎస్‌ఎఫ్‌ఐ, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విమర్శించాయి. పిఎస్‌ఎఫ్‌పై నిషేధాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాయి. ఇటువంటి నిరంకుశ చర్యల ద్వారా ప్రగతిశీల ఆలోచనలు, ప్రజాస్వామ్య విలువలను అణచివేయలేమని గుర్తించాలని ఎఐకెఎస్ పేర్కొంది. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, అధ్యక్షులు అశోక్ ధవాలే మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్ (పిఎస్‌ఎఫ్)ని నిషేధిస్తూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, టిఐఎస్‌ఎస్ అడ్మినిస్ట్రేషన్ తీసుకున్న చర్య అప్రజాస్వామికమని ఎస్‌ఎఫ్‌ఐ పేర్కొంది. ఈ చర్యను ఖండిస్తూ మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ ప్రకటన విడుదల చేశారు. పిఎస్‌ఎఫ్‌పై నిషేధం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు, విద్య, సామాజిక అంశాలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తుతున్న విద్యార్థుల గొంతును అణచివేయడానికి ఒక ప్రయత్నమని పేర్కొన్నారు. టిఐఎస్‌ఎస్ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ సంఘీభావంగా నిలుస్తుందని, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం కోసం వారి పోరాటానికి మద్దతు ఇస్తుందని తెలిపారు.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈ నెల 27 వరకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కస్టడీ పొడిగించారు. ఆయన కస్టడీ ముగియడంతో సిబిఐ ఆయనను మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచింది. ఈ సందర్భంగా కోర్టు కస్టడీని ఈ నెల 27 వరకు పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఉత్తర్వులు వెలువరించారు. ఈ నెల 14న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సిబిఐ స్పందన కోరింది. కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. సిబిఐ కేసులో ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్ కోసం ఆశ్రయించాలని సూచించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఇడి అరెస్టు చేయగా, జూన్ 20న మనీలాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. ఇడి దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో జులై 14న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

ఢిల్లీ ఆసుపత్రులు, మాల్స్‌కు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : ఢిల్లీలోని పలు ఆసుపత్రులకు మంగళవారం ఇమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు రావడంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. 'మరికొన్ని గంటల్లో పేలుడు సంభవించనుంది' అంటూ నంగ్లోయ్‌లోని ఆసుపత్రికి మధ్యాహ్నం 1:04 గంటలకు, సెంట్రల్ ఢిల్లీలోని చాణక్యపురిలో ప్రైమస్ ఆసుపత్రికి మధ్యాహ్నం 1:07 గంటలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ (డిఎఫ్‌ఎస్) అధికారి ఒకరు చెప్పారు. వివిధ షాపింగ్ మాల్స్‌కు కూడా బాంబు బెదిరింపులు వచ్చినట్లు తెలిపారు. అగ్నిమాపక యంత్రాలు, బాంబ్ డిటెక్షన్ బృందాలు, పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీలు ప్రారంభించినట్లు చెప్పారు. మంగళవారం రాత్రి వరకూ సోదాలు కొనసాగాయని, ఎలాంటి బాంబును గుర్తించలేదని చెప్పారు.

రిలయన్స్, డిస్నీ విలీనానికి బ్రేక్..!

- పోటీ వాతావరణానికి దెబ్బ
- సిసిఐ ఆందోళన
- దర్యాప్తు ఎందుకు చేయకూడదు..?

న్యూఢిల్లీ : రిలయన్స్ అనుబంధ సంస్థ, వాల్ డిస్నీ విలీనానికి బ్రేక్ పడే అవకాశాలు కనబడుతున్నాయి. వీటి విలీనంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) సందేహాలు వ్యక్తం చేసినట్లు రాయిటర్స్ మంగళవారం ఓ కథనం వెలువరించింది. ఇప్పటికే క్రికెట్ మ్యాచ్ ప్రసార హక్కులు పొందిన రిలయన్స్ అనుబంధ వయాకాం సంస్థలో వాల్ట్ డిస్నీ స్టార్ ఇండియా విలీనం వల్ల ఇతర సంస్థల మధ్య పోటీ వాతావరణాన్ని దెబ్బ తీస్తుందని సిసిఐ అనుమానాలు వ్యక్తం చేసిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇరు సంస్థల విలీన ప్రక్రియపై ఎందుకు దర్యాప్తునకు ఆదేశించకూడదో తెలుపాలని రిలయన్స్, డిస్నీ యాజమాన్యాలను సిసిఐ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం చాలా రహస్యమని సిసిఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందంలో క్రికెట్ ప్రసార హక్కులే అతిపెద్ద సమస్య అని తెలుస్తోంది. దీనివల్ల కోట్ల డాలర్ల విలువైన క్రికెట్ ప్రసార హక్కులు గల రిలయన్స్.. ప్రకటనదారులపై ఆధిపత్యం, ధరల మీద నియంత్రణ సాధిస్తుందన్న అనుమానాలు ఉన్నాయని సమాచారం. ఏకచత్రాధిపత్యం నెలకొంటే ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమ దెబ్బతింటుందనేది ప్రధాన ఆందోళన.

వీటి విలీనంపై ఇది వరకు రహస్యంగా ఇరు సంస్థలపై 100 ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. వీటిపై ఇప్పటికీ ఆయా సంస్థలు వివరణలు ఇస్తున్నాయని తెలుస్తోంది. గత ఫిబ్రవరిలో రిలయన్స్, స్టార్ ఇండియా విలీన ఒప్పందం ప్రకటించాయి. రిలయన్స్ సంస్థలో స్టార్ ఇండియా విలీనం తర్వాత ఏర్పాటయ్యే సంస్థలో మెజారిటీ వాటా ముకేష్ అంబానీకే ఉంటుంది. విలీనంతో కొత్తగా ఏర్పాటయ్యే అతిపెద్ద వినోద సంస్థ 120 టివి చానెళ్లు, రెండు స్ట్రీమింగ్ సర్వీసులను అందించనున్నాయి. దీంతో సోనీ, జీ ఎంటర్ టైన్‌మెంట్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి సంస్థలకు తీవ్ర పోటీని ఇవ్వనుంది. దీన్ని సునిశితంగా పరిశీలించాల్సి ఉందని సిసిఐ నిపుణులు చెప్పినట్లు తెలుస్తుంది. తమ తాజా ప్రశ్నలకు నెల రోజుల్లో వివరణ ఇవ్వాలని ఇరు సంస్థలను సిసిఐ ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయమై రిలయన్స్, డిస్నీ స్టార్ ఇండియా, సిసిఐ అధికారికంగా స్పందించాల్సి ఉంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికం రంగంలోకి ప్రవేశించిన తర్వాత ఈ రంగంలోని అనేక కంపెనీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అనేక టెల్కోలు తమ కార్యకలాపాలను రద్దు చేసుకున్నాయి. దీంతో ఈ రంగంలో భారీగా ఉద్యోగాలు ఊడాయి. తొలుత చౌక ధరల్లో మొబైల్ సేవలందించిన రిలయన్స్ జియో ఇప్పుడు భారీగా పెంచేసింది. దీంతో వినియోగదారులపైనా భారం పెరిగింది. డిస్నీ, రిలయన్స్ విలీనం తర్వాత టెలికం తరహాలోనే మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో భారీగా కుదుపు చోటు చేసుకునే ప్రమాదాలు లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదానీ, అంబానీల గ్రూపులు వేరు వేరుగా.. పోటాపోటీగా చేపడుతున్న కొనుగోళ్లు, విలీనాల వల్ల ఆయా రంగాల్లో ఉపాధి తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్న వేళ స్టార్ ఇండియా, వయోకాం విలీన ప్రతిపాదన ప్రక్రియ ఎలా ఉండొచ్చు వేచి చూడాలి.

కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ అంగీకారం

- హమాస్ కూడా అంగీకరించాలన్న బ్లింకెన్
- ఒప్పందంపై పెదవి విరిచిన హమాస్

టెల్ అవీవ్ : గాజాలో కాల్పుల విరమణకు, బందీల విడుదలకు నెలకొన్న అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవడానికి చేసిన ప్రతిపాదనను (బ్రిడ్జింగ్ ప్రపోజల్) ఇజ్రాయిల్ అంగీకరించిందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సోమవారం తెలిపారు. హమాస్ కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించాలని ఆయన కోరారు. అయితే హమాస్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు పరిష్కారమవుతాయా లేదా అనేది ఆయన వివరించలేదు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే ఇరాన్, హిజ్బుల్లాలు ఇజ్రాయిల్‌పై జరుపుతామని హెచ్చరిస్తున్న దాడిని నివారించవచ్చని దౌత్యవేత్తలు ఆశిస్తున్నారు. అందువల్ల ఇటీవలి రోజుల్లో కాల్పుల విరమణ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పైగా ఇప్పటికే పెచ్చరిల్లిన

ఉద్రిక్తతలతో ప్రాంతీయ యుద్ధం తలెత్తే ప్రమాదం పొంచి వుందనే ఆందోళన నెలకొంది. అంతకుముందు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో రెండున్నర గంటలపాటు చర్చలు జరిపిన బ్లింకెన్ మాట్లాడారు. తదుపరి చర్చల కోసం ఆయన ఈజిప్ట్, కతార్‌కు వెళ్లనున్నారు. పదే పదే చర్చలు స్తంభించిపోతుండడంతో గాజాలో దాడులను నివారించేందుకు నెలల తరబడిగా మధ్యవర్తులు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

తాజాగా బ్లింకెన్ మాట్లాడుతూ నెతన్యాహుతో నిర్మాణాత్మకమైన సమావేశం జరిగిందని చెప్పారు. ఆ బ్రిడ్జింగ్ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ మద్దతిస్తుందని ఆయన స్పష్టం చేశారని బ్లింకెన్ విలేకరులకు తెలిపారు. అయితే ఆ ప్రతిపాదనలో ఏయే అంశాలు వున్నాయనేది ఆయన వివరించలేదు. ఇక హమాస్ కూడా దీనికి ఎస్ అనడమే కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. హమాస్ గనక అంగీకరించినట్లైతే, రాబోయే రోజుల్లో ఒప్పందంపై స్పష్టమైన అవగాహనకు రావడానికి, అమలు చేయడానికి కసరత్తు జరుగుతుందని చెప్పారు. కొన్ని సంక్లిష్టమైన అంశాలు ఇంకా వున్నాయని, అయితే నేతలు వాటిపై కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం వుందని చెప్పారు. అవేంటనే వివరాలు కూడా ఆయన వెల్లడించలేదు.

కాగా మధ్యవర్తిగా అమెరికాపై తమకు నమ్మకం పోయిందని హమాస్ వ్యాఖ్యానించింది. కొత్త గాజా ప్రతిపాదన కూడా ఇజ్రాయిల్ డిమాండ్లు నెరవేరేలా వుందని హమాస్ పేర్కొంది.

స్కూలుపై దాడిలో 12మంది మృతి

గాజా సిటీలోని ముస్తఫా హఫీజ్ స్కూలుపై జరిగిన దాడిలో 12మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ ఆర్మీ హతమార్చింది. ఆ స్కూల్లో వందలాదిమంది నిర్వాసితులు తలదాచుకున్నారని పౌర రక్షణ దళాలుతెలిపాయి. తాజా దాడులతో ఇప్పటివరకు గాజాలో 40,173మంది మరణించగా, 92,857మంది గాయపడ్డారు.

వైద్యుల భద్రతపై జాతీయ టాస్క్‌ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)

వేచిచూసేలా చేశారు?' అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. గురువారం తెల్లవారుజామున ఆస్పత్రిపై వందలాది మంది దాడి చేయడం, ఘటనా స్థలం నుండి కోల్‌కతా పోలీసులు పారిపోయారంటూ ఆరోపణలు రావడంపై న్యాయస్థానం స్పందిస్తూ ఆస్పత్రి ప్రాంగణంలో సిఐఎస్‌ఎఫ్ సిబ్బందిని నియమించాలని ఆదేశించింది. 'ఈ ఘటన దేశంలోని వైద్య సిబ్బంది భద్రతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వైద్య సిబ్బంది చాలా తేలికగా హింసకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. చాలా మంది మహిళలు ఉద్యోగులుగా చేరుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారడానికి మరో అత్యాచారం జరిగే వరకూ దేశం ఎదురు చూడలేదు' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. మహిళలు సురక్షితంగా పనిచేసే పరిస్థితులు కల్పించలేకపోవడం అంటే వారికి సమానత్వం కల్పించడాన్ని నిరాకరించడమే అవుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఏడు వేల మంది ఆస్పత్రిలో ప్రవేశించడం, వారిలో 80-90 మంది విధ్వంసానికి పాల్పడడం, రెసిడెంట్ వైద్యులను బెదిరించడంపై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.

ఇదేం తీరు?

ఆస్పత్రి యాజమాన్యం, స్థానిక పోలీసుల తీరుపై సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. వేలాది మంది ప్రజలు వైద్య కళాశాల ఆస్పత్రిలో ప్రవేశిస్తుంటే వారిని అడ్డుకోవడంలో పోలీసుల వైఫల్యాన్ని నిలదీసింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ బెంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. ఎఫ్‌ఐఆర్ నమోదులో జాప్యంపై బెంగాల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ఉద్దేశించి 'బాధితురాలి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం అప్పగించిన మూడు గంటల తర్వాత ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు చేశారు?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై సిబల్ సమాధానమిస్తూ విచారణ ప్రారంభం కాగానే అసహజ మరణం కేసును నమోదు చేశామన్నారు. ఆస్పత్రి ప్రిన్సిపాల్ ప్రవర్తనపై పరిశీలన జరుగుతుండగానే ఆయనను మరో కళాశాలలో నియమించడాన్ని కూడా న్యాయస్థానం తప్పుపట్టింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బలప్రయోగం చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. పదిరోజులుగా వైద్యులు ఆందోళన చేస్తుండటంతో దేశవ్యాప్తంగా వైద్యసేవలకు అంతరాయం కలుగుతోందని, సాధ్యమైనంత త్వరగా సమ్మె విరమించి, విధుల్లో చేరాలని కోరింది. ఆస్పత్రిపై దాడి చేసి బీభత్సం సృష్టించిన వారిని అరెస్ట్ చేసి, వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. బాధితురాలి పోస్ట్‌మార్టం నివేదికను కూడా న్యాయస్థానం కూలంకషంగా పరిశీలించింది. సిఐఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్ బలగాలు ఆర్‌జి కర్ ఆసుపత్రి వద్ద భద్రత కల్పించాలని ఆదేశించింది.

వైద్యసిబ్బంది భద్రత విషయమై ఆసుపత్రులు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు అందించే గదుల వద్ద అవసరమైతే అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని పేర్కొంది. ఆసుపత్రుల్లోకి ప్రమాదకర వస్తువులు రాకుండా బ్యాగేజీ స్క్రీనింగ్ చేయాలని, లోపలికి వచ్చే విజిటర్స్ సంఖ్యపై పరిమితి ఉండాలని, తగినవిధంగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వైద్యులు, నర్సులకు రెస్ట్ రూమ్‌ల వసతి కల్పించాలని, అక్కడ బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ఏర్పాట్లు ఉండాలని పేర్కొంది. ఆసుపత్రి ప్రాంగణంలోని అన్ని ప్రాంతాల్లో సరిపడా వెలుతురు ఉండాలని, సిసి కెమెరాలను అమర్చాలని ఆదేశించింది. రాత్రి పది నుంచి తెల్లవారుజామున ఆరు గంటల మధ్యలో రవాణా సదుపాయం కల్పించాలని, సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వర్క్‌షాపులను నిర్వహించాలని సూచించింది. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ప్రతి మూడు నెలలకొకసారి ఆడిట్ చేపట్టాలని ఆదేశించింది. మహిళా ఉద్యోగులందరికీ సురక్షితమైన పనివాతావరణాన్ని కల్పించాలన్న నిబంధన వైద్య సంస్థలకు వర్తిస్తుంది కాబట్టి.. అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలని పేర్కొంది. వైద్య నిపుణులకు అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్‌లైన్ నంబర్స్ అందుబాటులో ఉంచాలని న్యాయస్థానం పేర్కొంది.

ఇజ్రాయిల్ బాంబు దాడులతో చిన్నారులను ఎత్తుకుని రోదిస్తూ వెళ్తున్న పాలస్తీనియన్లు

గాజా పాఠశాలపై ఇజ్రాయిల్ దాడి

- 12 మంది మృతి

పాలస్తీనా : గాజాలోని ఒక పాఠశాలపై ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం జరిపిన బాంబు దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజా సిటికి పశ్చిమాన ఉన్న ముస్తఫా హఫీజ్ పాఠశాలపై జరిపిన దాడిలో 12 మంది మరణించారని, మరణాలు పెరిగే అవకాశముందని గాజా పౌర రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నిరాశ్రయులై పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న పాలస్తీనియన్లపై ఈ దారుణానికి ఇజ్రాయిల్ ఒడిగట్టినట్టు పేర్కొంది.

భారత్, మలేషియా వ్యూహాత్మక భాగస్వామ్యం

న్యూఢిల్లీ : భారత్, మలేషియా ఇరు దేశాల మధ్య సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం దిశగా పెంచుతామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. మలేషియా ప్రధాని భారత్ పర్యటన కోసం ఢిల్లీకి చేరుకున్నారు. మంగళవారం భారత ప్రధాని మోడీ, మలేషియా ప్రధాని డాటో సేరి అన్వర్ బిన్ ఇబ్రహం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. 'భారతదేశం, మలేషియా ఒక దశాబ్దపు భాగస్వామ్యాన్ని పూర్తి చేసుకున్నాయి. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం మద్దతుతో ఇరు దేశాల భాగస్వామ్యంలో కొత్త శక్తి ఊపందుకుంటున్నది' అని పేర్కొన్నారు.

సిక్కింలో కొండచరియలు పడి ఆరు ఇళ్లు, ఎన్‌హెచ్‌పిసి భవనం ధ్వంసం

గౌహతి : సిక్కింలోని గాంగ్‌టక్ జిల్లాలో తీస్తా-వి జలవిద్యుత్ కేంద్రం ఉన్న ప్రాంతంలో మంగళవారం కొండచరియలు విరిగిపడటంతో ఆరు ఇళ్లు, నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పిసి)కు చెందిన భవనం ధ్వంసమయ్యాయి. జల విద్యుత్ కేంద్రం ఉన్న బలుతార్ ప్రాంతంలో ఉదయం 7:30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం గురించి గాంగ్‌టక్ జిల్లా కలెక్టర్ తుషార్ జి. నిఖారే మీడియాతో మాట్లాడుతూ 'కొండచరియలు విరిగిపడటంతో ఎన్‌హెచ్‌పిసికు చెందిన జిఐఎస్ భవనం, ఆరు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇందులోని నివాసితుల్ని సురక్షితంగా ఖాళీ చేయించాం. సింగ్‌టామ్-డిక్చు రోడ్డు కూడా ధ్వంసమయింది. రవాణా కోసం ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశాం' అని తెలిపారు. ఖాళీ చేసిన నివాసితుల్ని ఎన్‌పిహెచ్‌పిసి గెస్ట్‌హౌస్‌కు తరలించినట్లు చెప్పారు.

భారీ భద్రత నడుమ 'ఉదయ్‌పూర్' బాలుడి అంత్యక్రియలు

జైపూర్ : రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో తోటి విద్యార్థి చేతిలో కత్తిపోట్లకు గురై మరణించిన బాలుడి అంత్యక్రియలు భారీ భద్రత నడుమ మంగళవారం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య బాలుడి ఇంటి నుంచి అశోక్ నగర్‌లో శశ్మానవాటిక వరకూ అంతిమ యాత్ర నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఊరేగింపు వెంట ఉన్నారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజలు నినాదాలు చేశారు. ఈ నెల 16న పాఠశాలలో కత్తిపోట్ల ఘటన జరిగిన తరువాత నుంచి ఉదయ్‌పూర్ పట్టణంలో మతపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. విద్యాసంస్థలను మూసివేశారు. మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధం కొనసాగుతోంది. కత్తిపోట్లకు గురైన బాలుడు నాలుగు రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. కత్తితో పొడిచిన విద్యార్థిని జువైనల్ జస్టిస్ చట్టం కింద అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్‌లో జోరువాన

- కొట్టుకుపోయిన బైక్‌లు, కార్లు
- ఒకరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరాన్ని మంగళవారం భారీ వర్షం ముంచెత్తింది. కుండపోత వానకు నగర రహదారులు చెరువులను తలపించాయి. కాలనీల్లో రోడ్లపై వరద ప్రవాహానికి పార్కింగ్ చేసిన బైకులు, కార్లు కొట్టుకుపోయాయి. రామ్‌నగర్‌లో ఓ వ్యక్తి వరదలో కొట్టుకుపోయి మృతిచెందారు. ఎల్బి స్టేడియం ప్రహరీ గోడ కూలడంతో పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసమయ్యాయి. నగరంలో భారీ వర్షానికి హోర్డింగ్‌లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలడంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలాలు పొంగి ప్రవహిస్తుండటంతో జిహెచ్‌ఎంసి అప్రమత్తమయింది. భారీ వర్షాల నేపథ్యంలో చెరువుల వద్ద జిహెచ్‌ఎంసి అత్యవసర బృందాలను మోహరించింది. పలు జిల్లాలలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత

(మొదటి పేజీ తరువాయి)

వీరికి గౌరవ వేతనం పేరుతో స్వల్పంగా చెల్లించి వెట్టి చాకిరీ చేయించారన్నారు.పాలకులు మారినప్పుడల్లా కొత్త ఉపాధిని కల్పించకపోగా ఉన్న ఉపాధికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించడంతో చిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన హుమయూన్ బాష మాట్లాడుతూ గత ప్రభుత్వం వాలంటీర్స్‌కు ప్రశంసలు, అవార్డులు , రివార్డులు ఇవ్వడమే తప్ప కనీస వేతనాలు , పనిగంటలు, పనిభద్రత , విధి విధానాలు లేకుండా చాకిరీ చేయించిందన్నారు. వాలంటీర్ ఆదాయంపైనే ఆధారపడ్డ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎపి గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హుమయూన్ భాష, కె.ధనలక్ష్మి, కోశాధికారిగా హేమంత్‌తో పాటు 9మంది ఆఫీస్ బేరర్స్‌గా, 55మందితో రాష్ట్ర కార్యవర్గం ఏర్పడింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, ఆర్‌వి నరసింహారావులతో పాటు పెంచలయ్య, భవానీ ప్రసాద్, కొండబాబు, కె.వెంకట్, హేమంత్,జి.దీప్తిలు ప్రసంగించారు.

సాంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం

సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే దేశంలోనే సాంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ -2024పై సిఎం మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంగంలో లో2014- 19 మధ్య కాలంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నామని, 2019లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలోకి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్రంలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ, బయో ఎనర్జీకి ఉన్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగేలా కొత్తపాలసీ ఉండాలని సూచించారు. ఈ పాలసీ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా, వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్తు సరఫరా చేసే విధంగా చూడాలని సిఎం అన్నారు. వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో సాంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తికి అనసరిస్తున్న ఉత్తమ విధానాలను మరింత విస్తృతంగా పరిశీలించాలని అన్నారు. ప్రజలు,సంస్థలు స్వయంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవడం, తమ అవసరాలు తీరిన తర్వాత మిగిలిన విద్యుత్తును అమ్ముకోవడానికి సులభతరంచేసేలా పాలసీ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో లభించే క్వార్ట్జ్ ఖనిజం ద్వారా సోలార్ విద్యుత్తు ఫ్యానెళ్లు తయారు చేస్తారని ఈకారణంగా సోలార్ ఫ్యానెళ్ల తయారీ పరిశ్రమలను రప్పించే అంశంపైనా దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి భద్రత కొనసాగించండి : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భద్రత కుదింపునకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్ విచారణ 2 వారాలకు వాయిదా పడింది. గతంలో ఉన్న 2ప్లస్2 భద్రతను రాష్ట్ర ప్రభుత్వం సగానికి తగ్గించి వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని వైవీ తరపు లాయర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదించారు. 2004 నుంచి సుబ్బారెడ్డికి 2ప్లస్ 2 భద్రత ఉందన్నారు. ప్రాణహాని లేనందున భద్రతను కుదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సుబ్బారెడ్డికి తెలియచేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. అయితే మళ్లీ ఉత్తర్వులు జారీ చేసే వరకు సుబ్బారెడ్డికి 2 ప్లస్ 2 భద్రతను కొనసాగించాలని ప్రభుత్వానికి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ఆదేశించారు.

పొన్నవోలు భద్రత కేసులో తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి, అమరావతి

తనకున్న భద్రతను ప్రభుత్వం కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ప్రకటించారు. పిటిషనర్‌కు ఎలాంటి ప్రాణహాని లేదని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. తీర్పు వెలువడే వరకు పిటిషనర్‌కు ప్రస్తుతం 2 ప్లస్ 2 భద్రతను కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే ఇందుకయ్యే వ్యయాన్ని పిటిషనరే భరించాలని ఆదేశించింది.

బాలినేని పిటీషన్ నేడు విచారణ

ఇవిఎంలు, వీవీప్యాట్ల తనిఖీలు, పరిశీలన స్థానంలో మాక్ పోలింగ్ నిర్వహించాలనే ఎన్నికల సంఘం నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ బుధవారం కొనసాగిస్తామని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటించారు. ఇవిఎంలు, విప్యాట్ల పరిశీలన చేయకుండా, వాటికి బదులుగా మాక్ పోలింగ్ నిర్వహించడం గత నెల 16న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకమని సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ మంగళవారం హైకోర్టులో వాదించారు. సుప్రీంకోర్టు తీర్పునకు కేంద్ర ఎన్నికల సంఘం తప్పుగా విశ్లేషణ చేస్తోందన్నారు. అయితే సుప్రీం ఉత్తర్వులను పిటిషనర్ బాలినేని తప్పుగా అర్థం చేసుకున్నారని ఇసి తరపు న్యాయవాది దేశాయ్ అవినాష్ వాదనలు వినిపించారు.

104 సిబ్బంది వేతన వెతలు

- మూడు నెలలుగా జీతాలు పెండింగ్
- పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు

సమస్యలపై ఆందోళన చేస్తున్న 108 ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

108 ఉద్యోగులు వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. గత 3 నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్నాయి. దీంతో కుటుంబ పోషణకు అప్పులతో అవస్తలు పడుతున్నారు. ఒక వైపు పెరుగుతున్న పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక సమస్యలు వారిని చుట్టుముడుతున్నాయి. గట్టిగా నిలదీస్తే పైస్థాయిలో వేధింపులు తప్పడం లేదు. ఇలా శారీరకంగా, మానసికంగా, ఆర్థికపరంగా సిబ్బంది సమస్యలతో సతమతం అవుతున్నారు. తీరిక లేని విధులతో 108 అంబులెన్స్ సిబ్బంది సతమతం అవుతున్నారు. నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇవ్వాల్సి ఉంది. సిబ్బంది కొరతతో సెలవులు మంజూరు చేయడం లేదు. కనీసం ఆఫ్‌లు ఇవ్వడం లేదు. విరామం లేకుండా విధులు నిర్వహిస్తుండడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రెండు లేక మూడు నెలలకోసారి ఇవ్వటంతో ఆర్థికంగా దెబ్బతింటున్నారు. కుటుంబ పోషణకు కష్టాలు పడుతున్నారు. సిబ్బందిపై వేధింపులు అధికమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నిస్తే అదనపు విధులు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

